# జనపదం
JANAPADHAM

హైదరాబాద్ | సోమవారం 07 అక్టోబర్ 2024 | సంచిక: 1 సంపుటి: 120 | తెలుగు దినపత్రిక


## సాగనంపిన సీతక్క..

- గాంధీ ఆస్పత్రి నుంచి ఆదివాసి మహిళ డిశ్చార్జ్
- చీర, నగదుతో బాధితురాలికి మనో ధైర్యం
- కావాల్సినవి సమకూర్చిన మంత్రి
- ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ..

5

## కొలువులు నింపుడే కీలకం..

- యువతకు ఉద్యోగాలే సర్కార్ లక్ష్యం..
- వేలల్లో నియామకాలే చిత్తశుద్ధికి నిదర్శనం
- ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే బాధ్యత మీదే
- పదేండ్ల దుర్మార్గాన్ని విడిపించాం
- మూసీ ప్రక్షాళన చేసి తీరుతాం..
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేత

జనపదం, హైదరాబాద్ సిటీ:

నిరుద్యోగ జంగ్ సైరన్ మోగించిన నాడు.. వాళ్ల ఉద్యోగాలు ఊడితేనే మీకు ఉద్యోగాలు వస్తాయని తాను చెప్పానని, తన మాటపై నమ్మకం ఉంచి కాంగ్రెస్ ను గెలిపించారని సీఎం రేవంత్రెడ్డి నిరుద్యోగులపై ప్రసంశలు కురిపించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడగానే 90 రోజుల్లోనే ప్రమాణ స్వీకారం చేసిన చోటే 30వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందించినట్లు చెప్పారు. దసరా పండగ నేపథ్యంలో తెలంగాణలో ....(తరువాయి 4లో)

పండుగ బోనాంజా. లక్కీ లాటరీ. ఇన్నాళ్లు వెయిటింగ్ లో ఉన్న అదృష్టం ఇప్పుడు మెడకు పదవి రూపంలో పట్టుకోబోయే సందర్భం. పార్టీ అధికారం చేపట్టిన నుంచి ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న శుభఘడియల తరుణం కళ్లముందే సాక్షాత్కరిస్తున్న సమయం. ఇప్పటికే ఒక్కొక్కటిగా ఫుల్ ఫిల్ చేస్తూ హస్తం కోసం అహర్నిశలు కష్టపడిన వారికి అందలం కట్టబెడుతూ వస్తున్న పెద్దలు ఆ పనిని మరింత స్పీడప్ చేశారు. మరో ఆరుగురికి మంత్రి పదవులు కట్టబెట్టేందుకు ముహూర్తం ఫిక్స్ చేసే పనిలో నిమగ్నమవడమే కాకుండా, ఒకే రోజు 13 జిల్లాలకు గ్రంథాలయ సంస్థల చైర్మన్లు నియమిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. అలాగే సమాచార హక్కు చట్టం ప్రధాన కమిషనర్తో పాటుగా 9 మంది కమిషనర్లను ఒకేసారి నియమించేందుకు కూడా రేవంత్ సర్కార్ విధివిధానాలను రూపొందిస్తున్నది.

# దసరా గిఫ్ట్..

## పదవుల పంపకం షురూ

ఆరు మంత్రి స్థానాల భర్తీ ముహూర్తం ఫిక్స్ | ఒక్కరోజే 13 జిల్లాలకు గ్రంథాలయ సంస్థ చైర్మన్లు

నేడో రేపో కార్పొరేషన్ చైర్మన్ల ప్రకటన | రైతు విద్యా కమిషన్ సభ్యుల నియామకం పూర్తి | గవర్నర్ కు రెండు రోజుల్లో ఆర్టీఐ కమిషనర్ల ఫైల్

**గ్రంథాలయ సంస్థలకు చైర్మన్ల వివరాలు...**

| | |
|---|---|
| నిర్మల్ | సయ్యద్ అర్షుమంద్ అలీ |
| సిరిసిల్ల | నాగుల సత్యనారాయణ గౌడ్ |
| కరీంనగర్ | సత్తు మల్లయ్య |
| రంగారెడ్డి | ఎలుగంటి మధుసూధన్ రెడ్డి |
| వనపర్తి | జి. గోవర్ధన్ |
| సంగారెడ్డి | గొల్ల అంజయ్య |
| కామారెడ్డి | మద్ది చంద్రకాంత్ రెడ్డి |
| మెదక్ | సుహాసిని రెడ్డి |
| నారాయణ్పేట్ | వరాల విజయ్ కుమార్ |
| నాగర్ కర్నూల్ | జి. రాజేందర్ |
| వికారాబాద్ | శేరి రాజేశ్ రెడ్డి |
| మహబూబ్నగర్ | మల్లు నరసింహారెడ్డి |
| జోగులాంబ గద్వాల | నీలి శ్రీనివాసులు |

జనపదం, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో నామినేటెడ్ పదవుల భర్తీపై దృష్టి సారించింది. ఇప్పటికే 37 కార్పొరేషన్ల పోస్టులు భర్తీ చేసిన ప్రభుత్వం.. ఇంకా పలు పోస్టులను ఖాళీ పెట్టారు. ఇదే సమయంలో మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్పోస్టుల భర్తీ కోసం సీఎం రేవంత్రెడ్డి.. ఏఐసీసీతో పలుమార్లు చర్చించారు. దీనితోపాటుగా వీసీల నియామకం పూర్తి చేసేందుకు కసరత్తు కొనసాగుతోంది. ఇప్పటికే బీసీ, విద్య, రైతు కమిషన్ల చైర్మన్లు ఎంపిక పూర్తి కాగా సభ్యుల నియామకంపై కాంగ్రెస్ దృష్టి సారించింది. గతంలోనే ఈ పోస్టులను భర్తీ చేయాల్సి ఉండగా.. రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల కారణంగా కొంత ఆలస్యమైంది. రోజు రోజుకు ఒత్తిళ్లు పెరుగుతుండడంతో పార్టీ కోసం పని చేసిన వారితో భర్తీ చేయాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం భావిస్తోంది. మొదటి విడతలో 37 మందికి వివిధ కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించిన పార్టీ రాష్ట్ర నాయకత్వం మరికొంత మందికి రెండో విడత కింద కార్పొరేషన్ చైర్మన్ల పదవులు ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. సామాజిక సమతుల్యత పాటించి ఈ పదవులు భర్తీ చేయాల్సి ఉంది. డిమాండ్ అధికంగా ఉండడంతో పార్టీ నాయకత్వం ఆచితూచి ముందుకు పోతోంది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలోని 13 జిల్లాల గ్రంథాలయ సంస్థలకు చైర్మన్లను నియమించింది.

**పార్టీకోసం పనిచేసిన వారికే..**

పార్టీ బలోపేతానికి పని చేసిన వారికే పదవులు దక్కాలన్న .....(తరువాయి 4లో)

## ప్రక్షాళన ఎవరి కోసం..?

- బ్యూటిఫికేషన్ పేరుతో బడా బాబులకే..
- అడ్డుకోవడం మా పని కాదు..
- ముందు అఖిలపక్షం ఏర్పాటు చేయండి
- సీఎం రేవంత్కి ఎంపీ ఈటల ఘాటు లేఖ

4

## 'రెవెన్యూ' చాలా కీలకం..

- ప్రభుత్వానికి కళ్లు, చెవులు ఆ శాఖ అధికారులే..
- ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా వ్యవస్థ ప్రక్షాళన
- దసరాలోపే ఎన్నికల బదిలీల తహసీల్దార్లపై నిర్ణయం
- రెవెన్యూ గ్రామానికో అధికారి
- దేశానికి రోల్ మోడల్ గా తెలంగాణ కొత్త రెవెన్యూ చట్టం
- స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లతో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖాముఖి

5

ఐదు ఊర్ల ముచ్చట తెగేనా..?

## భద్రాద్రికి బలం పెరిగేనా..?

తెలంగాణలో కలిపేందుకు గతంలో ఏపీ ఒకే.. కేంద్ర హోం శాఖ సమావేశంలో చర్చించే అవకాశం సమావేశానికి హాజరు కానున్న ముఖ్యమంత్రి

2

# డియర్ యూత్ మాట్లాడుకోండి..

## దసరాకు దోస్త్ లతో చర్చించండి..

## గ్యారంటీలు గయాబ్...

- పథకాలకు శరగోపం.., అందరి నెత్తిన అప్పుల తాపడం..
- రేవంత్ ఎన్నికల ప్రచారం అవకాశవాదమే..
- ఓటేసినందుకు ఇదేనా పండుగ బహుమతి..?
- అలయ్ బలయ్ తీసుకోండి.. అన్ని ముచ్చట్లు మాట్లాడండి..
- యువతకు హరీష్ రావు పిలుపు..
- కాంగ్రెస్ సర్కార్ ఫైయిల్యూర్స్ పై దిశానిర్దేశం..

జనపదం, హైదరాబాద్ సిటీ: గత ఏడాది దసరా సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను నమ్మి తమ భవిష్యత్తు కోసం కాంగ్రెస్కు ఓటు వేయాలని గ్రామాల్లో ప్రచారం చేసిన యువత ఒక్కసారి ఆలోచించించాలని మాజీ మంత్రి హరీష్ రావు సూచించారు. గ్యారెంటీలు అమలు చేయలేక పోగా, మీ ఊళ్లలో అవ్వాతాతలకు పెంచుతామన్న పింఛన్ కూడా ఎప్పటి లాగానే వస్తుందన్నారు. ఇక రుణమాఫీ పూర్తి చేయలేదని, రైతు బంధును నిలిపివేశారన్నారు. రైతు భరోసా దిక్కులేకుండా పోయింది, బోనస్‌ను బోగస్ చేశారని మండిపడ్డారు.

**పండుగ వేళ చర్చ జరగాలి..**

మోసానికి ఎక్కడో ఓ దగ్గర ఫుల్ స్టాప్ పడాలని, అడిగే వారు లేకపోతే ఆడిందే ఆట.., పాడిందే పాటగా రెచ్చిపోయే కాలమిదన్నారు. ఎన్నో ఆశలతో .....(తరువాయి 4లో)

## పోటీని తట్టుకునేలా బోధన..

- ప్రమాణాలతో యంగ్ ఇండియా స్కూళ్లు
- రూ.5 వేల కోట్లతో రెసిడెన్షియల్ స్కూళ్లు..
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్ పై సమావేశం
- ఈనెల 11న పాఠశాలలకు శంకుస్థాపనకు నిర్ణయం..
- ఒక్కో పాఠశాలకు సుమారు రూ.26 కోట్ల ఖర్చు
- ఇప్పటికే 24 నియోజకవర్గాల్లో స్థలాల ఎంపిక..
- నిర్మాణానికి డిజైన్లు ఖరారు
- సమావేశానికి హాజరైన మంత్రులు పొన్నం, కోమటిరెడ్డి వెంకట రెడ్డి

5



# ఆపరేషన్ గరుడ..?

మావోయిస్టుల ఏరివేతలో కీలకం | డ్రోన్లకు స్వస్తి.. గద్దలు, డేగలతో పని

కాళ్లకు జీపీఎస్ ట్రాకర్లు, మెడకు కెమెరాలు | మొయినాబాద్‌లో శిక్షణ.. | తెలంగాణ ఎస్ఐబీ నుంచే కీలక సమాచారం

తాజా ఎన్‌కౌంటర్‌లో ఇన్ఫార్మర్లూ హతం? | మావోయిస్టు ప్రభావిత సీఎంలో నేడు షా సమావేశం..

4

నిర్మూలనే ధ్యేయంగా వాళ్లు., సమసమాజమే లక్ష్యంగా వీళ్లు.. ఎవరికి వారుగా జరుపుతున్న సమరానికి వేదికైన అభయారణ్యం నెత్తురు దారల రుచి మరిగి రోజుకిన్ని ప్రాణాలను బలికోరుతోంది. సర్కార్లు జల్లడపడుతుండగా మావోయిస్టులు మూల్యం చెల్లించుకుంటున్నారు. డేగ కళ్లేసి చూస్తున్న నిఘా నుంచి తప్పించుకోలేక దిక్కులేనివారిగా నేలకొరుగుతున్నారు. పెరిగిన టెక్నాలజీతో చిక్కటి అడవిలో ప్రతీది స్పష్టంగా తెలుస్తున్నది. అలికిడి వినిపిస్తున్నది., కదలిక కనిపిస్తున్నది. ఆపరేషన్ కగార్ తో కంగారు పుట్టిస్తూ పచ్చని ప్రకృతిలో రోజు వెన్నులో వణుకుపుట్టిస్తున్న ఘటనే. మావోయిస్టుల ఏరివేతకు డేగలను, గద్దలను రాయబారులుగా వాడుకుంటూ బీజేపీ సర్కార్ డెడ్ లైన్ పెట్టుకుని మరీ సాగుతున్నది. ఈ క్రమంలోనే నేడు హోం మంత్రి అమిత్ షా ఆయా రాష్ట్రాల సీఎంలో భేటీ జరిపి మరింత లోతు విశ్లేషణలు జరుపనున్నారు.

## నేడు షా భేటీ..

హస్తినాకు పయనమైన సీఎం రేవంత్.. 2026 నాటికి మావోయిస్టుల తుడిచివేత లక్ష్యంగా పావులు..

## సోయిలేని సీఎం..

- రైతులే కాదు.. కౌలు రైతులూ ఆగమయ్యారు
- రేవంత్ కు అన్నదాతల చేతిలో దండన తప్పదు..
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- మంచిరోజులొస్తాయని కర్షకులకు ధైర్యం..

4

# ఆపరేషన్ కగార్..

- టార్గెట్ అబూజ్మాడ్
- దండకారణ్యంలో మావోల వేట
- కోవర్టులతో చిక్కుతున్న దళాలు
- 2026 టార్గెట్ గా కేంద్రం వ్యూహం
- ప్రభావిత రాష్ట్రాల సీఎంలతో 'షా' భేటీ

**జనపదం, హైదరాబాద్ బ్యూరో :** కొంతకాలం కిందట వరకు అన్నలు మినహా.. ఎవరికీ దారి దొరకని దండకారణ్యంలో పోలీసులు తాండవం చేస్తున్నారు. కోవర్టుల కారణంగా దళాలలను ముట్టుబెడుతున్నారు. మావోయిస్టు పార్టీ వార్షికోత్సవ వేళ అన్నలకు భారీ ఎదురు దెబ్బ తగిలింది. అబూజ్ మాడ్ లో దాదాపు 38 మంది మావోయిస్టులు ఎన్ కౌంటర్ లో చనిపోయారు. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రం చేస్తోన్న దాడుల్లో మావోయిస్టులు మరో దఫా తమ క్యాడర్ ను కోల్పోయారు. అయితే సంబాల కేశవరావు, తక్కెళ్ల పల్లి వాసుదేవరావు వంటి కీలక మావోయిస్టు నేతలు ఈ ఎన్కౌంటర్ నుంచి ఎలాగో తప్పించుకున్నారు. ఒకవేళ వాళ్లు కూడా ఇక్కడే ఉంటే.. మావోయస్టులకు పెద్ద దెబ్బగానే చెప్పవచ్చు. ఓవైపు ఆపరేషన్ అబూజ్మాడ్ను కొనసాగిస్తున్న కేంద్రం.. ఇప్పుడు మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల సీఎంలతో ప్రత్యేకంగా భేటీ అవుతుండటం ఇప్పుడు చర్చగా మారింది.

### రెడ్ కారిడార్ లో పట్టు తప్పిందా..?

రెడ్ కారిడార్ పేరుతో మావోయిస్టులు గత కొన్నేళ్లుగా తమ బలాన్ని ప్రదర్శించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ రెడ్ కారిడార్ నే కాంపాక్ట్ జోన్ రివెల్యూషనరీ జోన్ గా మావోలు పిలుచుకుంటారు. అంటే 10 రాష్ట్రాల్లో దాదాపు 70కి పైగా జిల్లాల్లో విస్తరించి ఉంది. ఛత్తీస్‌గఢ్ లోని 13 జిల్లాలు, ఒడిషా 10 జిల్లాలు, మహారాష్ట్ర రెండు జిల్లాలు, జార్ఖండ్ 16 జిల్లాలు, బీహార్ 10 జిల్లాలు, పశ్చిమ బెంగాల్ 1 జిల్లా, ఆంధ్రప్రదేశ్ 5 జిల్లాలు, తెలంగాణ 6 జిల్లాలు, కేరళ 3 జిల్లాలు, మధ్యప్రదేశ్ 3 జిల్లాల్లో రెడ్కారిడార్ ఏర్పాటే ఉంది. తెలంగాణ లో రెడ్ కారిడార్ గా మావోయిస్టులు చెప్పుకుంటున్న ఆరు జిల్లాలు భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, కొమరం భీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్ ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలు ఉన్నాయి. అయితే ఈ రెడ్ కారిడార్ 70 జిల్లాల్లో ఉన్నట్లు చెప్పుకున్నా వాస్తవ పరిస్థితి చూస్తే, మావోయిస్టు పార్టీ 2014 నాటికే 200 జిల్లాల్లో తన ప్రభావాన్ని చూపుతున్నట్లు కేంద్ర ప్రభుత్వ లెక్కల్లో తెలింది. ఇంతలా తన ప్రాభల్యాన్ని చాటుకునేందుకు కొద్ది కాలంగా మావోయిస్టు పార్టీ ప్రయత్నం చేస్తోంటే మరో వైపు కేంద్ర ప్రభుత్వం ఎక్కడిక్కడ మావోలకు చెక్ పెట్టుకుంటూ వస్తోంది.

### గ్రీన్ హంట్.. కగార్ ..

ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రీన్ హంట్, ఆపరేషన్ కగార్ పేరుతో పెద్ద ఎత్తున మావోయిస్టులను ఎన్ కౌంటర్లు లేదా లొంగిపోయేలా చేయడం ద్వారా కేంద్రం తన బలాన్ని చాటుతోంది. అయితే పెద్ద సంఖ్యలో మావోయిస్టులు ఎన్ కౌంటర్లలో ప్రాణాలు కోల్పోతున్నారు. 2026 నాటికి దేశంలో తుపాకి పట్టుకుని ఎర్రజెండా మోసే మావోయిస్టు పార్టీని లేకుండా చేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పదే పదే ప్రకటనలు చేస్తున్నారు. అందుకు అనుగుణంగా మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో ఆపరేష్ కగార్ ను చేపట్టారు. తాము తొలి సారి అధికారంలోకి వచ్చిన 2014 లో నక్సల్ ప్రభావిత జిల్లాల సంఖ్య 200 ఉంటే దాన్ని 2024 సెప్టెంబర్ నెల నాటికి 43 జిల్లాలకు పరిమితం చేశామని అమిత్ షా ప్రకటన చేయడం మావోలకు ఎలాంటి ఎదురు దెబ్బలు తగిలాయో అర్థం చేసుకోవచ్చు. కేంద్రం లెక్కల ప్రకారం 2024 జనవరి నాటికి 700 మావోయస్టులను ఎన్ కౌంటర్లో మట్టుబెట్టడమో., లేదా వారిని ఆయుధాలు వదిలి జన జీవన స్రవంతిలో కలిసేలా లొంగదీయడమో జరిగిందని తెలుస్తోంది. ఆపరేషన్ కగార్ చేపట్టిన నాటి నుండి మావోయిస్టు పార్టీ కొంత ఆత్మరక్షణ ధోరణితో ఉన్నా, కేంద్ర బలగాలు వారిని వెంటాడుతూనే ఉన్నాయి.

### ఎరుపెక్కిన అబూజ్మాడ్

రెడ్ కారిడార్ లో మావోయిస్టు పార్టీల ప్రాబల్యం క్రమంగా తగ్గుతూ ఇప్పుడు వారి సేఫ్ జోన్ గా ఉన్న అబుజ్ మాడ్. కానీ, అబూజ్మాడ్ దండకారణ్యంలోను తూపాకుల మోత మోగుతోంది. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర బలగాలు ఏకంగా వారి సేఫ్ జోన్ల లోకి ప్రవేశించింది. గతంలో మావోయిస్టుల సమస్యను అప్పటి కేంద్ర ప్రభుత్వాలు ఓ శాంతిభద్రత సమస్యగా భావించేవి. స్టేట్ లా అండ్ ఆర్డర్ రాష్ట్ర ప్రభుత్వాల పనిగా కేంద్రం వదిలేసేది. కాని మావోయిస్టుల ప్రభావం పెరగడం ఒక రాష్ట్రంలో మావోలు తమ కార్యకలాపాలు సాగించి పక్క రాష్ట్రం లో తలదాచుకోవడం వంటి సంఘటనలతో వారిని అదుపు చేయాలంటే సమన్యయం అవసరం అని అన్ని రాష్ట్రాలు భావించాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో మావోయిస్టుల కార్యకలాపాలను ఇక్కడి పోలీసులు నిర్దాక్షిణ్యంగా అణిచివేయడం, నిరంతర నిఘాను పెంచడం, నక్సల్స్ ను అణిచివేసేందుకు గ్రేహౌండ్స్ వంటి ప్రత్యేక శిక్షణ పొందిన దళాలను ఏర్పాటు యడం, ఏ ప్రభుత్వం వచ్చినా పోలీసులు మావోయిస్టులపైన, వారి సానుభూతి పరులపైన ఉక్కుపాదం మోపడం వంటి చర్యలతో మావోయిస్టులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో తమ కార్యకలపాలు తగ్గించి ఛత్తీస్ ఘడ్, ఒడిశా, మహారాష్ట్రకు సరిహద్దులు దాటి వెళ్లిపోవడం జరిగింది. అప్పడప్పుడు తెలంగాణలో మావోయిస్టులు ప్రవేశించినా ఒకప్పటితో పోల్చితే వారి కార్యక్రమాలు చాలా తగ్గిపోయాయి. అదే రీతిలో తెలంగాణ ,ఏపీ సరిహద్దు రాష్ట్రాల్లో వారి కదలికలు పెరిగాయి. ఆయా రాష్ట్రాల ఇంటలిజెన్స్, ప్రభుత్వాల నివేదికతో లెఫ్ట్ వింగ్ ఎక్స్ట్రీమిజం ను అంతం చేయాలంటే కేంద్రమే రంగంలోకి దిగాలని, మావోయిస్టు పార్టీపై ఓ విధాన నిర్ణయం తీసుకోవాలన్న ఆలోచనకు వచ్చింది. దీంతో కేంద్ర ప్రభుత్వమే మావోల అణివేతకు కార్యాచరణ ప్రారంభించింది. అందులో భాగంగానే ఆపరేషన్ గ్రీన్ హంట్, ఆపరేషన్ కగార్ పుట్టుకొచ్చాయి. అప్పటి నుండి మావోయిస్టు పార్టీకి పుట్టెడు కష్టాలు ప్రారంభమయ్యాయి. ఒక్కో జిల్లా నుండి మావోలను దూరం చేస్తూ వారి ప్రభావాన్ని కేంద్ర బలగాలు తగ్గిస్తూ వచ్చాయి. దాదాపు 60 వేల చదరపు కిలోమీ టర్లు విస్తరించిన దండకారణ్యంలో ఇ ప్పుడు మావోల అడుగు చప్పుడు కష్టమవుతున్నది. ఇదంతా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్ ఘడ్, ఒడిస్సా రాష్ట్రాల మధ్య విస్తరించి ఉన్న దట్టమైన అటవీ ప్రాంతం. ఈ ప్రాంతం అంతా దట్టమైన అడవులు, పర్వతా లు, సెలయేర్లతో నిండిన ప్రాంతం. ఆదివాసీ గిరిజనులు నివసించే ప్రాంతం. ఈ దండకారణ్యాన్ని తమ బేస్ గా చేసుకుని మావోయిస్టు పార్టీ పని చేస్తోంది. ప్రభుత్వంపై అసంతృప్తి ఉన్న గిరిజనులే వీరికి ప్రధాన మద్దతు దారులు. జన చేతన సర్కార్ పేరుతో సమాతంర ప్రభుత్వాన్ని ఈ దండకారణ్యంలో మావోయిస్టులు నడిపారు. విద్య, వైద్యం, గిరిజనులకు అవసరమైన ఆహార పంపిణీ వంటి పనులను చేపట్టారు. అంటే మావోయిస్టులు ఈ దండకారణ్యంలో ఏ రకమైన సాధికారిత కలిగి ఉన్నారో మనం అర్థం చేసుకోవచ్చు. మావో దళాలు మిలటరీ శిక్షణ కోసం, ఆయా ప్రాంతాల్లో చెపట్టే కార్యక్రమాల ప్రణాళిక రచన, ఆయుధ సామగ్రి దంపుల ఏర్పాటు వంటి వాటికి దండకారణ్యాన్ని వాడుకుంటోంది. ఓ రకంగా చెప్పాలంటే మావోలకు దండకారణ్యం ఓ అతి పెద్ద సేఫ్ జోన్. ఇటు అబుజ్ మాడ్ 5200 కిలిమీటర్ల పరిధిలో వ్యాపించిన దట్టమైన అటవీ ప్రాంతం. ఇది ఛత్తీస్ ఘడ్ లో ఎక్కువగా వ్యాపించి ఉంది. ఆ రాష్ట్రంలోని నారాయణ పూర్ జిల్లాలోనే దాదాపు 4000 కిలోమీటర్లు వ్యాపించి ఉంది. దంతెవాడ, బీజాపూర్, కొండెగావ్, సుక్మా జిల్లాల్లో కొంత విస్తరించి ఉంది. ఇది మావోయిస్టులకు అతి పెద్ద స్థావరంగా చెప్పుకోవాలి. ఈ ప్రాంతంలోనే ఐరన్ ఓర్ సహా విలువైన ఖనిజ సంపద ఉంది. అయితే ఇక్కడ కూడా ఆదివాసీలను ఆకట్టుకున్న మావోయిస్టు పార్టీ సమాంతర ప్రభుత్వం నడుపుతోంది. అయితే గత కొన్నేళ్లుగా మావోయిస్టుల ఆసుపాసులు కనిపెట్టిన కేంద్ర బలగాలు పెద్ద ఎత్తున దెబ్బతీస్తున్నాయి.

### కగార్ పేరుతో మారణహోమం

ఆపరేషన్ కగార్ 2017లో మావోయిస్టులను నిర్మూలించేందుకు ఛత్తీస్ ఘడ్ లో ప్రారంభమైన పోలీస్ ఆపరేషన్. దేశంలో మావోయిస్టుల ఏరివేతనే ఈ ఆపరేషన్ ముఖ్య లక్ష్యం. ఇందులో భాగంగా మావోల కు స్థావరాలైన దండకారణ్యం, అబుజ్ మా డ్ లను జల్లెడ పట్టి మావోలను నిర్మూలిస్తే ఆ పార్టీ అంతర్ధానమవుతుందన్నది కేంద్ర పెద్దల ఆలోచన. అందులో భాగంగా సుశిక్షితులైన సీఆర్పీఎఫ్ కోబ్రా, ఇండో టిబెటియన్ బోర్డర్ పోలీస్, డిస్ట్రిక్ రిజర్వ్ గార్డ్స్ ( డీఆర్జీ), ఎస్టీఏఫ్ దళాలు, బీఎస్ఎఫ్, బస్తర్ ఫైటర్ దళాలు రంగంలోకి దిగి మావోలను భౌతికంగా నిర్మూలిస్తున్నాయి. అత్యాధునిక ఆయుధాలు, డ్రోన్లు, మా నవ రహిత విమానాలను సైతం రంగంలోకి దింపి మావోయిస్టులను ఈ దళాలు మట్టుబెడుతున్నాయి. మావోయిస్టుల కంచు కోటలైన దండకారణ్యం, అబుజ్ మాడ్ లలో చొచ్చుకుని వెళ్లి మావోయిస్టు పార్టీ ని రూపు మాపడమే లక్ష్యంగా ఆపరేషన్ కగార్ సాగుతోంది. 2026 కల్లా ఆ పార్టీని రూపు మాపడం కేంద్ర లక్ష్యంగా చెబుతున్నారు. అయితే 2009లోనే గ్రీన్ హంట్ పేరుతో కమాండో బెటాలియన్స్ ఫర్ రెస్పాన్స్ అండ్ యాక్షన్ ( కోబ్రా) పేరుతో మావోలను ఏరి వేసినా, ఆపరేషన్ కగార్ మా త్రం నక్సల్స్ కు భారీ ఎత్తున నష్టాన్ని చేకూర్చుతోంది. అందులో భాగంగానే శుక్రవారం జరిగిన ఎన్ కౌంటర్లో 38 మంది మావోయిస్టులు భద్రతా బలగాల చేతుల్లో మృత్యువాత పడ్డారు. అయితే రానున్న రోజుల్లో ఈ రెండు స్థావరాలయిన అబుజ్ మాడ్, దండకారణ్యం నుంచి మావోల ఉనికి లేకుండా చేస్తే దేశంలో ఆ పార్టీ ఉనికి కోల్పోయినట్లేనని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ కీకారణ్యంలోనే మిలట్రీ శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని భావిస్తోంది. మావోలపై ఆర్మీని రంగంలోకి దించకపోయినా, ఆ అటవీ ప్రాంతం తమ పరిధిలో ఉంచుకోవడం, అక్కడి అటవీ ఉత్పత్తులు, ఖనిజ సంపదను ఆధీనంలో ఉంచుకోవడం కూడా కేంద్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా కనబడుతోంది. ఇందు కోసం ఆర్మీ మకాం అక్కడ వేయాలన్న వ్యూహంలో ఎన్డీఏ ప్రభుత్వం ఉంది. అంతే కాకుండా ప్రతీ ఐదు కిలోమీటర్లకు భద్రతా బలగాల బేస్ క్యాంపు ఏర్పాటు చేయడం, కమ్యూనికేషన్ సదుపాయాలు కల్పించడం, ఆత్యాధునిక ఆయుధాలు, టెక్నాలజీని వాడటం, డ్రోన్లు, మానవరహిత విమానాలు అందుబాటులో ఉంచి మావోలను అణచివేయడం ఇప్పటికే జరుగుతోంది




# ఆ ఐదు గ్రామాల ఊసే లేదు..

- తెలంగాణలో కలిపేందుకు గతంలో ఏపీ సానుకూల సంకేతం
- మూడు నెలలైనా విలీన ప్రక్రియలో కనిపించని పురోగతి..
- నేటి కేంద్ర హోం శాఖ సమావేశంలో చర్చించే అవకాశం
- సమావేశానికి హాజరు కానున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**జనపదం, భద్రాద్రి కొత్తగూడెం :** ఉమ్మడి ఖమ్మం జిల్లా నుండి ఏపీలో కలిపిన ఐదు గ్రామ పంచాయితీలను తిరిగి తెలంగాణలో కలిపేందుకు మూడు నెల్ల క్రితం హైదరాబాద్ లో జరిగిన రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో ఆ రాష్ట్ర ప్రభుత్వం సూత్రపాయంగా అంగీకరించింది. గోదావరి ముంపు నుండి భద్రాచలం పట్టణాన్నీ, పరిసర గ్రామాలను రక్షించాలంటే, ఆ గ్రామాలను తిరిగి తమకివ్వాలని తెలంగాణ ప్రభుత్వం చేసిన విజ్ఞప్తికి, అప్పుడు ఏపీ ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. అయితే, అది కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశం కావడం, అందుకు చట్ట సవరణ కూడా చేయాల్సి రావడంతో, కేంద్ర హోం శాఖకు ఒక లేఖ రాయాలని నిర్ణయించారు. ఆ తర్వాత దీనిపై అడుగు ముందుకు పడుతుందని అందరూ భావించారు. కానీ, ఇంత వరకూ ఎటువంటి పురోగతి కనిపించడం లేదు. సోమవారం కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆధ్వర్యంలో జరిగే సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరవుతున్నారు. ఏపీ నుండి కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లేదా అధికారులు హాజరయ్యే అవకాశముంది. ఈ సందర్భంగా ఇరు రాష్ట్రాలు కలిసి అమిత్ షాను కోరితే, సమస్య పరిష్కారమయ్యే అవకాశముంది. ఎంతో కాలంగా ఆ ఐదు గ్రామాల ప్రజలు తిరిగి తమను తెలంగాణలో కలపాలని కోరుతున్నారు. ఆయా గ్రామ సభల్లో తెలంగాణ అసెంబ్లీలో కూడా దీనిపై తీర్మానాలు చేశారు. కానీ, ఇంత వరకూ విలీన ప్రక్రియ కార్యరూపం దాల్చలేదు.

### ఆంధ్రాలో ఎప్పుడు కలిపారు..?

తెలంగాణ ఏర్పడిన తర్వాత, 2014 జూన్ 2న ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 7 మండలాలను ఒక ఆర్డినెన్స్ ద్వారా ఏపీలో కలిపారు. ఈ బిల్లును అదే సంవత్సరం జులై 11న లోక్ సభ ఆమోదించింది. ఫలితంగా కుక్కునూరు, వేలేరుపాడు, బూర్గంపాడు, చింతూరు, కూనవరం, వి.ఆర్ పురం మండలాలతో పాటు భద్రాచలం మండలంలోని ఐదు గ్రామ పంచాయితీలు గుండాల, పిచ్చుకుల పాడు, కన్నాయి గూడెం, ఎటపాక, పురుషోత్తం పట్నం ఆంధ్రాలో కలిశాయి. ఈ ఐదు గ్రామ పంచాయతీల పరిధిలో దాదాపు 20 గ్రామాలున్నాయి. పోలవరం ప్రాజెక్ట్ పూర్తైతే, తెలంగాణలోని ఈ మండలాలు ముంపునకు గురవుతాయి. వీటిని ఏపీలో కలిపితే ప్రాజెక్ట్ నిర్మాణానికి తెలంగాణ అనుమతి అవసరముండదు. ముంపు ప్రాంతంలో పునరావాస చర్యలు వేగంగా చేపట్టవచ్చు. అందువల్ల అప్పటి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్రంపై వత్తిడి తెచ్చి ఈ 7 మండలాలను ఏపీలో కలిపేలా చేశారు.ఆ గ్రామాలు ఇప్పుడెందుకు అవసరం..? ఇప్పుడు వాటిలోని ఐదు గ్రామాలను మాత్రమే తిరిగి తెలంగాణలో కలపాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం కోరుతోంది. ఈ ఐదు గ్రామాలు భద్రాచలాన్ని ఆనుకొనే వుంటాయి. అన్నీ 2 నుండి 10 కిలోమీటర్ల పరిధిలోనే వున్నాయి. ఈ గ్రామాల్లోనే వందల ఎకరాల రాములోరి భూములున్నాయి. భద్రాచలం పట్టణాన్ని అభివృద్ధి చేయాలన్నా, పూర్తిగా వరద ముంపు నుండి రక్షించాలన్నా ఈ గ్రామాలు కావాలి. వీటిని తెలంగాణ తిరిగి తీసుకొని, ఆ గ్రామాల చుట్టూ పూర్తిస్థాయిలో కరకట్ట కట్టక పోతే, భద్రాచలం మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుంది. అక్కడున్న రామాలయం కూడా ముంపునకు గురవుతుంది. తెలంగాణ వైపు కరకట్ట పూర్తిగా కట్టినప్పటికీ, ఆంధ్రా ప్రాంతంలో వున్న ఈ ఐదు గ్రామాల చుట్టూ పటిష్టంగా కరకట్ట కట్టక పోతే, వరదంతా ఆ గ్రామాల నుండి భద్రాచలాన్ని ముంచెత్తుతుంది. అందువల్ల, భద్రాచలంలో ఏ అభివృద్ధి కార్యక్రమం చేపట్టాలన్నా, ముంపును దృష్టిలో పెట్టుకొని ఆగిపోవాల్సి వస్తుంది. అంతే కాకుండా భద్రాచలం నుండి ప్రక్కనే వున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని దుమ్ముగూడెం, చర్ల మండలాలకు వెళ్లాలంటే ప్రస్తుతం ఆంధ్రలో ఉన్న ఈ భూభాగం నుండే వెళ్ళాలి. అంటే, తెలంగాణ నుండి తెలంగాణకు వెళ్లాలంటే మధ్యలో వున్న ఆంధ్రా దాటుకొని వెళ్లాల్సి వస్తోంది. గోదావరి వరదల సమయంలో ఇలా తిరిగి వచ్చి దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో సహాయక చర్యలు చేపట్టాలంటే సాధ్యం కావడం లేదు. మరో వైపు ఆ ఐదు గ్రామాల ప్రజలు కూడా ఆంధ్రలో వుండడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ గ్రామాల నుండి జిల్లా హెడ్ క్వార్టర్ పాడేరు వెళ్లాలంటే, 200 కిలోమీటర్లుపైనే ప్రయాణించాలి. ఆరోగ్య కేంద్రాలు, కళాశాలలు దరిదాపుల్లో లేవు. ప్రక్కనే వున్న భద్రాచలంలో అన్నీ వున్నాయి. కానీ, ఉపయోగించుకోవడానికి నాన్ లోకల్ అవుతున్నారు. ఈ గ్రామాలు వరద ముంపుకు గురైతే, ఆంధ్ర ప్రభుత్వం సహాయక చర్యలు చేపట్టడం సాధ్యమే కాదు. ఏం చెయ్యాలన్నా తెలంగాణ నుండే చేయాలి. అందుకే తెలంగాణ ప్రభుత్వం ఈ ఐదు గ్రామాలను కావాలంటోంది. వీటిని తీసుకొని భద్రాచలం చుట్టూ పూర్తి స్థాయిలో కరకట్ట కడితే, పట్టణాన్ని, దక్షణ అయోధ్యగా పేరు గాంచిన రామాలయాన్ని రక్షించొచ్చు, అభివృద్ధీ చేయొ చ్చు. అందుకు, రేవంత్ రెడ్డి ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం వుంది.

# మెట్రోను విస్తరించకపోతే ఉద్యమిస్తాం..

- ఎమ్మెల్యే కెపి.వివేకానంద్
- మద్దతుగా ఎంపీ ఈటల రాజేందర్

**జనపదం, మేడ్చల్ :** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మహానగరాభివృద్ధికి నలువైపులా మెట్రో విస్తరణ, ఫ్లైఓవర్లు, అండర్ పాసుల నిర్మాణం వంటి వి చేయాలని నిర్ణయించి ప్రణాళికలు రూపొందిస్తే, కాంగ్రెస్ సర్కార్ పక్కనపడేయడం ఇక్కడి ప్రజలను అవమానించడమే అని ఎమ్మెల్యే కెపి వివేకానంద్ అన్నారు. మెట్రో సాధన సమితి ఆధ్వర్యంలో జీడిమెట్ల గ్రామంలోని గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన మహా ధర్నా కార్యక్రమానికి ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడుతూ కేసీఆర్ నగరాన్ని ఎంతో అభివృద్ధి చేయాలని, ఉత్తరం వైపున కొంపల్లి, మేడ్చల్ ప్రాంతాలతో పాటు తూముకుంట, శామీర్పేట్ ప్రాంతాలకు మెట్రో విస్తరణ చేయాలని సర్వే సంస్థలను ఎంపికచేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజులకే వాటన్నింటినీ పక్కన పెట్టి ఫోర్త్ సిటీ పేరుతో ఊహల నగరానికి మెట్రో విస్తరణ ను చేపట్టాలని అనుకోవడం కుత్బుల్లాపూర్ ప్రజలను అవమానించడమే అన్నారు. ఊహల నగరంగా సృష్టించి లేని నగరానికి మెట్రో విస్తరణ పేరుతో 8 వేల కోట్ల రూపాయలు ప్రతిపాదించడం వెనుక రియల్ ఎస్టేట్ వ్యాపార ఆలోచన తప్పా ప్రజలకు మేలు చేయాలని లేదన్నారు. ఫోర్త్ సిటీ పేరుతో ముఖ్యమంత్రి ఇన్ సైడ్ ట్రేడింగ్ కు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ నిర్ణయాలు ప్రజా సంక్షేమం కోసం ఉండాలే తప్పా స్వార్థ రాజకీయాల కోసం ఉండొద్దన్నారు. ముఖ్యమంత్రి అనుభవరాహిత్యం, అ సంబద్ధ నిర్ణయాలతో కోర్టులతో నిత్యం మొట్టి కాయలే అని, చెరువుల పరిరక్షణ పేరుతో సీఎం ఏర్పాటుచేసిన హైడ్రా, మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇల్లా కూల్చివేత, ఫోర్త్ సిటీ పేరుతో ఊహల నగరానికి నిధుల కేటాయింపు వంటి నిర్ణయాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని దుయ్యబట్టారు. తమకు న్యాయబద్ధంగా రావాల్సిన మేడ్చల్ మెట్రోను సాధించి తీరుతాం అన్నారు.

### విస్తరించకపోతే ఉద్యమిస్తాం...

ఉత్తర తెలంగాణకు నగరానికి కనెక్టివిటీగా ఉన్న జాతీయ రహదారి 44 లో మేడ్చల్ ప్రాంతం గుండా నిత్యం నిజామాబాద్, కరీంనగర్ ప్రాంతాలకు మంత్రులు ప్రయాణిస్తూ ఉంటారని, మేడ్చల్ కు మెట్రో ను విస్తరించకుంటే ఈ మార్గంలో ఏ మంత్రిని తిరగనివ్వమని హెచ్చరించారు. కార్యక్రమంలో మేడ్చల్ మెట్రో సాధన సమితి కార్యవర్గ సభ్యులు, కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు, వార్డు సభ్యులు, సీనియర్ నాయకులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### మద్దతుగా ఎంపీ ఈటల రాజేందర్

జీడిమెట్ల గాంధీ విగ్రహం వద్ద మెట్రో కావాలని నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు. ఆయనతో పాటు బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి, డా.ఎస్ మల్లారెడ్డి, మెట్రో సాధన సమితి సభ్యులు సంపత్ రెడ్డి,మహేందర్ రెడ్డి,వెంకటేశ్వర రెడ్డి,మైపాల్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మాణిక్ రెడ్డి, రాజి రెడ్డి, గిరివర్ధన్ రెడ్డి, శేఖర్ యాదవ్, కట్ట కుమార్, పులి బలరాం,పత్తి సతీష్, జె.రాజు, రాజు, చక్రి, అరవింద్, ఎశ్వంత్, సతీష్, వెంకు, నార్లకంటి దుర్గయ్య, నార్లకంటి ప్రతాప్, కృష్ణ, సాయిలు, చిత్తారీ, శివ తదితరులు పాల్గొన్నారు.

# ఫేక్ పోస్టులపై చర్యలు తీసుకోవాలి..

- బీఆర్ఎస్ నాయకుల డిమాండ్..
- తప్పు దిద్దుకోకపోతే చర్యలు..
- పోలీసులకు ఫిర్యాదు..

**జనపదం, హైదరాబాద్ సిటీ :** కేటీఆర్ పైన కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఫేక్ పోస్టుల పై చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ నాయకులు ఫిర్యాదు చేశారు. అసభ్యకరమైన, అసత్యమైన ఫేక్ పోస్టులు చేయడం ఆపకుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేటీఆర్ పైన అసత్య ప్రచారాల పక్కన పెట్టి ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపైన ఫోకస్ చేయాలని సూచించారు.

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పైన పదేపదే తప్పుడు పోస్టులు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ పైన కారు నాయకులు మండిపడ్డారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికక్కడ సామాజిక మాధ్యమాల్లో పలువురు పెడుతున్న అసహ్యకరమైన అడ్డగోలు, ఫేక్ పోస్టుల పైన చట్టపరంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పలు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. నిజామాబాద్ జిల్లా పార్టీ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి సలహా మేరకు నిజామాబాద్ జిల్లా కమిషనర్ కి పార్టీనేతలు పలు సామాజిక మాధ్యమాల్లో ఉన్న పోస్టులపైన ఫిర్యాదు చేశారు. హైదరాబాదు లోనూ సీసీఎస్ కేంద్ర కార్యాలయంలో గోషామహల్ నియోజకవర్గం నాయకులు ఆశిష్ కుమార్ యాదవ్ తదితరులు స్థానిక ఏసీపీకి ఫిర్యాదు చేశారు. అలాగే సిరిసిల్లలోనూ పలువురు యువ నాయకులు పట్టణంలోని పోలీస్ స్టేషన్లో కేటీఆర్ పైన పెట్టిన పలు పోస్టుల పైన ఫిర్యాదు చేశారు. వరంగల్లోనూ పలు చోట్ల ఈ అసత్యమైన సోషల్ మీడియా పోస్టుల పైన ఫిర్యాదు చేశారు.

ఒకవైపు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ సోషల్ మీడియాలో ఇతర పార్టీలు తమపైన దుష్ప్రచారం చేస్తున్నాయని మొసలి కన్నీరు కారుస్తూనే, మరోవైపు తన పార్టీ కార్యకర్తలు, పెయిడ్ ట్రోల్స్ తో భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పైన నిరంతరంగా దుష్ప్రచారం చేయిస్తున్నారని బి ఆర్ ఎస్ పార్టీ నేతలు మండిపడ్డారు. పలు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదులు చేసిన తర్వాత వారు మీడియాతో మాట్లాడారు. ఒకవేళ కాంగ్రెస్ పార్టీ అసహ్యకరమైన ఈ దుష్ప్రచారాన్ని ఆపకుంటే గట్టి సమాధానం చెబుతామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం చేతకాకనే అటెన్షన్ డైవర్షన్ లో భాగంగా ఈ ఈ నీచమైన ప్రయత్నానికి కాంగ్రెస్ పార్టీ తెరలెపిందన్నారు. ఇప్పటికైనా తమ బుద్ధి మార్చుకొని ఇతరులకు సుద్దులు చెబుతున్న తీరుగా, తమ సొంత పార్టీ సోషల్ మీడియాను నియంత్రణలో ఉంచాలని ముఖ్యమంత్రికి సూచించారు.

# హోటళ్లలో సీసీ కెమెరాలలు తప్పనిసరి

- వంటగదులు, భోజనశాలలో నిఘా
- జీహెచ్ఎంసీ ఆదేశాలు



**జనపదం, హైదరాబాద్ :** గ్రేటర్‌లోని 50మంది సామర్థ్యం దాటిన హోటళ్లలో వంటగదులు, భోజనశాలలో సీసీ కెమెరాలు ఇక నుంచి తప్పనిసరి. వినియోగదారులకు శుచి, శుభ్రమైన ఆహారం అందించేందుకు వీలుగా ఈ నిబంధనను తప్పకుండా అమలు చేయాలని జీహెచ

# వసూళ్ల ప్లానింగ్‌కు కేరాఫ్ శేరిలింగంపల్లి..

- ఆ సర్కిల్‌ను వదలనంటున్న టీపీఎస్
- బదిలీ అయినా కూకట్ పల్లికి వెళ్లడానికి ఇష్టపడని అవినీతి అధికారి..?

**జనపదం, హైదరాబాద్ సిటీ :** ప్రతి రోజు బంగారు గుడ్డు పెట్టే బాతును ఎవరైనా చంపుకుంటారా...? నిత్యం అక్రమార్జనతో కళకళలాడుతున్న ఆదాయాన్ని ఎవరైనా వదులుకుంటారా...? సరిగ్గా ఇలాంటి సంఘటననే శేరిలింగంపల్లి సర్కిల్ లో జరుగుతుంది. కూకట్ పల్లి సర్కిల్ కు బదిలీ అయినప్పటికీ శేరిలింగంపల్లి సర్కిల్ ను వదిలి వెళ్ళేది లేదని ఓ అవినీతి అధికారి నిసిగ్గుగా నవ్విపోదురు గాని నాకేటి సిగ్గు అన్నట్లు భీష్మించుకు కూర్చోవడం పట్ల ఆ అధికారి అక్రమార్జనకు ఏ స్థాయిలో అలవాటు పడ్డాడో అర్థమవుతుంది. శేరిలింగంపల్లి సర్కిల్ లో టౌన్ ప్లానింగ్ విభాగంలో టీపీఎస్ గా విధులు నిర్వహిస్తున్న రవీందర్ అనే అధికారికి కూకట్ పల్లి సర్కిల్ కు బదిలీ అయింది. అయినా తాను మాత్రం శేరిలింగంపల్లి సర్కిల్ వదిలి వెళ్లేది లేదని భీష్మించుకు కూర్చున్నట్లు తెలుస్తోంది. ఇటీవల జీహెచ్ఎంసీ పరిధిలో టౌన్ ప్లానింగ్ విభాగంలో చేపట్టిన బదిలీలలో భాగంగా రవీందర్ ను జీహెచ్ఎంసి అధికారులు కూకట్ పల్లి సర్కిల్ కు బదిలీ చేశారు. శేరిలింగంపల్లి సర్కిల్ కు బదిలీపై వచ్చిన నూతన సిబ్బంది గురు, శుక్రవారాల్లో వారి బాధ్యతలను స్వీకరించినట్లు తెలుస్తోంది. కూకట్ పల్లి సర్కిల్ నుంచి శేరిలింగంపల్లి సర్కిల్ కు బదిలీ పై వెళ్లిన ఓ అధికారి కూడా అక్కడ భాధ్యతలు స్వీకరించినా తాను మాత్రం కూకట్ పల్లి సర్కిల్ కు వెళ్లనని రవీందర్ అనే అధికారి తోటి సిబ్బందితో చెబుతున్నట్లు సమాచారం. డిప్యూటేషన్ పై వచ్చి 6 సంవత్సరాలు గడుస్తున్న రవీందర్ శేరిలింగంపల్లి సర్కిల్ లోనే పాగా వేసుకుని కూర్చున్నారని తెలుస్తోంది. కూకట్ పల్లి సర్కిల్ కన్నా శేరిలింగంపల్లి సర్కిల్ లోనే ఆదాయం ఎక్కువని, ఎవరేమనుకున్నా తాను ఇక్కడే ఉంటానని భీష్మించుకు కూర్చోవడంతో నవ్విపోదురు గాని నా కేంటి సిగ్గు అన్నట్లు ఉందని స్థానిక ప్రజలు నవ్వుకుంటున్నారు. ఆ సర్కిల్ లో అవినీతి ఏ స్థాయిలో జరుగుతుందో తెలియజేయడానికి ఈ ఘటననే ఉదాహరణ అని స్థానిక ప్రజలు బహిరంగంగానే చర్చించుకోవడం విశేషం.

# రాహుల్ బొజ్జాకు మంత్రి కోమటిరెడ్డి పరామర్శ

**జనపదం, బ్యూరో :** ఇటీవల కన్నుమూసిన పౌర హక్కుల నేత బొజ్జా తారకం సతీమణి, సీనియర్ ఐఏఎస్ అధికారి రాహుల్ బొజ్జా మాతృమూర్తి ప్రముఖ రచయిత్రి బి.విజయభారతి సంస్మరణ కార్యక్రమానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హాజరై నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగులో డాక్టరేట్ పొందిన మొట్టమొదటి దళిత మహిళ విజయభారతి గారని ఆయన గుర్తు చేసుకున్నారు. వారి తండ్రి బోయి భీమన్న అద్భుతమైన రచనలు చేశారని, వారి వారసత్వాన్ని పునికిపుచ్చుకొని విజయభారతి కూడా ప్రాచీన సాహిత్యం, ఆధునిక సాహిత్యంలో విశేష కృషి చేశారని కొనియాడారు.

# భార్యలతో జర జాగ్రత్త..

- వీపు రుద్దమన్నందుకు రాడ్‌తో దాడి
- హాస్పిటల్ కు తరలించిన స్థానికులు

**జనపదం, హైదరాబాద్ సిటీ :** వీపు రుద్దమన్నందుకు ఓ మహిళ తన భర్తపై ఐరన్ రాడ్‌తో దాడి చేసి గాయపరిచింది. హైదరాబాద్ పరిధిలో ఈ ఘటన జరగగా, బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానికులు, బాధితుడి కథనం ప్రకారం.. నల్గొండ జిల్లాకు చెందిన శివ అనే వ్యక్తి తన భార్య, పిల్లలతో కలిసి నగరంలోని కేపీహెచ్‌బీలో నివాసం ఉంటున్నాడు. ఆదివారం ఉదయం స్నానం చేసే క్రమంలో శివ తన వీపు రుద్దాలని భార్యపై గట్టిగా కేకలు వేశాడు. చుట్టుపక్కల వారు వింటే బాగోదని భార్య చెప్పడంతో ఆమెతో వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య గొడవ పెద్దదై పెనుగులాట జరిగింది. ఆగ్రహంతో ఊగిపోయిన భార్య అక్కడే ఉన్న ఇనుప రాడ్‌తో భర్త తలపై దాడి చేసింది. దీంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న స్థానికులు అతన్ని స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై శివ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే, ఇంత చిన్న విషయానికి భర్త తలపై భార్య కొట్టడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# హైదరాబాదీలకు డేంజర్ బెల్స్

## హుస్సేన్ సాగర్... మరింత ప్రమాదకరం

- వినాయక విగ్రహాల నిమజ్జనంతో కాలుష్య కాసారం
- సాగర్ చుట్టూ పడిపోయిన ఆక్సిజన్ లెవల్స్
- అధిక మోతాదులో రసాయనాలు ఉన్నట్లు నివేదికలో వెల్లడించిన పీసీబీ
- పరిసర ప్రాంతాల్లో చర్మ సంబంధిత వ్యాధులు వస్తాయంటూ హెచ్చరికలు
- నీటిలో ఉండే జీవుల మనగడకూ పొంచి ఉన్న ప్రమాదం

**జనపదం, హైదరాబాద్ :** హుస్సేన్ సాగర్ డేంజర్ బెల్స్ మోగిస్తోంది. ఇక సాగర్ పరిసర ప్రాంత వాసులు అలెర్టుగా ఉండాల్సిందే. అలాగే సాగర్ తీరాన కొద్దిసేపు ఆహ్లాదకరంగా గడుపుదామని భావించిన వారు ఒకటికి రెండు సార్లు ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా చర్మ సంబంధిత వ్యాధులు రావడం పక్కా అని తెలుస్తోంది. ఈ విషయాన్ని స్వయంగా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) తన పరిశీలన నివేదికలో వెల్లడించడం గమనార్హం. ప్రస్తుతం సాగర్ పూర్తిగా కాలుష్య కాసారంగా మరిందని వెల్లడించింది. ప్రధానంగా వినాయక విగ్రహాల నిమజ్జనంతో సాగర్ కాలుష్యం మరింతగా పెరిగిపోయిందని తెలిపింది. విగ్రహాల నిమజ్జనంతో అధిక మోతాదులో రసాయనాలు ఉన్నట్లు పీసీబీ గుర్తించింది. మనషులతో పాటు సాగర్ లో ఉండే జీవుల మనుగడ సైతం ప్రమాదమేనని తెలుస్తోంది. ముఖ్యంగా లేపాక్షి హ్యాండిక్రాఫ్ట్స్ వైపు ఐదు ప్రాంతాల్లో క్రోమియం అధిక మోతాదులో ఉన్నట్లు నిర్ధారించింది. గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి ముందు, తర్వాత సాగర్ చుట్టుపక్కల ఆరు ప్రాంతాల్లో నీటి నాణ్యతను టెస్ట్ చేసిన పీసీబీ తాజాగా ఈ ఫలితాలను విడుదల చేసింది. నెక్లెస్ రోడ్, బుద్ధ విగ్రహం, లేపాక్షి హ్యాండిక్రాఫ్ట్స్, ఎన్టీఆర్ పార్కు వద్ద రెండు చోట్ల, లుంబినీ పార్కు సమీపంలో అనేక నమునాలను సేకరించిన అధికారులు ల్యాబ్‌కు పంపించారు. నీటిలోని టీడీఎస్(టోటల్ డిజాల్వుడ్ సాలిడ్స్), టీఎస్ఎస్(టోటల్ సస్పెండెడ్ సాలిడ్స్), సీవోడీ(కెమికల్ ఆక్సిజన్ డిమాండ్), డీవో(డిజాల్వుడ్ ఆక్సిజన్), బీవోడీ(బయోకెమికల్ ఆక్సిజన్ డిమాండ్), టోటల్ కొలిఫామ్, ఫీకల్ కొలిఫామ్ స్థాయులు ఎలా ఉన్నాయో వెల్లడించింది.

సాగర్‌లో వినాయక విగ్రహాల నిమజ్జనం వేళ అన్ని చోట్ల టీఎస్ఎస్(టోటల్ సస్పెండెడ్ సాలిడ్స్)–నీటి అడుగున చేరే మలినాలు, టర్బిడిటీ అధిక మోతాదులో ఉందని పేర్కొన్నది. తర్వాత తగ్గినా, నిమజ్జనం ముందున్న స్థాయికి మాత్రం చేరుకోలేదు. బుద్ధ విగ్రహం, ఎన్టీఆర్ పార్కు, లుంబినీ పార్కు వద్ద అత్యధిక మోతాదులో టీడీఎస్(టోటల్ డిజాల్వుడ్ సాలిడ్స్) నమోదైంది. దీంతో చర్మ సంబంధ దుద్దుర్ల సమస్యలు ఉత్పన్నమవుతాని పేర్కొన్నది. బయోకెమికల్ ఆక్సిజన్ డిమాండ్(బీవోడీ), కెమికల్ ఆక్సిజన్ డిమాండ్(సీవోడీ) స్థాయిలు పెరిగిపోయాయని పేర్కొన్నది. బీవోడీ పెరిగితే కాలుష్యం పెరిగినట్టే అని నిపుణులు పేర్కొంటున్నారు. ఇది లీటరు నీటిలో 3 ఎంజీల కంటే ఎక్కువ నమోదుకాకూడదు. అన్ని ప్రాంతాల్లో అంతకు మించి నమోదైంది. నీటిలో ఉండే జీవుల మనుగడకు అవసరమైన డిజాల్వుడ్ ఆక్సిజన్(డీవో) లీటరు నీటిలో 4 ఎంజీల కంటే తక్కువగా ఉండరాదు. కానీ సాగర్‌లో చాలా చోట్ల 2.5 నుంచి 4 ఎంజీల మధ్య నమోదైంది. గత సంవత్సరంతో పోలిస్తే ఎన్టీఆర్ పార్కు ప్రాంతం మినహా ఇతర ప్రాంతాల్లో టీడీఎస్ స్థాయిలు ఒకేలాగా ఉన్నాయి. లుంబినీ పార్కు, ఎన్టీఆర్ పార్కు, నెక్లెస్‌రోడ్ ప్రాంతాల్లో కెమికల్ ఆక్సిజన్ డిమాండ్ తక్కువగా నమోదైంది. దీంతో హుస్సేన్ సాగర్ ప్రస్తుతం నగర వాసుల్లో కలవరాన్ని కలిగిస్తోంది.

# నల్లమలలో చెంచు యువకుడి అదృశ్యం

- 8 రోజులు గడుస్తున్న కానరాని ఆచూకీ
- కుటుంబ సభ్యుల ఆవేదన

**జనపదం, నాగర్ కర్నూల్ :** అటవీ ఉత్పత్తులు, కట్టెల కోసమని మిత్రుడితో నల్లమల అడవులకు వెళ్లిన ఓ చెంచు యువకుడు అచూకీ ఎనిమిది రోజులుగా లేకుండా పోయింది.. అడవిలో అదృశ్యమైన చెంచు యువకుడి ఆచూకీ కోసం అటవీశాఖ, పోలీస్ అధికారులు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. నాగర్ కర్నూల్ జిల్లా లింగాల మండలం ఎర్రపెంటకు చెందిన చెంచు యువకుడు నిమ్మల శంకర్ గత నెల 28న శ్రీరంగాపురం గ్రామానికి చెందిన మిత్రుడు ఉడుతల కృష్ణయ్యతో కలిసి సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతానికి వెళ్లారు. చీకటి పడటంతో అక్కడే వాగు సమీపంలో పడుకున్నామని, రాత్రివేళ మెలకువ వచ్చి చూస్తే శంకర్ కనిపించలేదని కృష్ణయ్య చెబుతున్నాడు. అడవిలోకి వెళ్లి వారం రోజులుగా ఆచూకీ లేకుండాపోయిన శంకర్ జాడ కోసం అటవీ శాఖ, పోలీస్ అధికారులు మూడు రోజులుగా సెర్చ్ ఆపరేషన్ చేపట్టినా ఫలితం లేకుండాపోయింది. ఆదివారం నుంచి డ్రోన్ ద్వారా సైతం గాలింపు చర్యలు చేపడతామని డీఎఫ్ వో రోహిత్ గోపిడి తెలిపారు. చెంచు యువకుడు శంకర్ ఆచూకీ తెలియకపోవడంతో భార్య లక్ష్మమ్మ, కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. శంకర్ కు ముగ్గురు కూతుళ్లు, మూడు నెలల చిన్నారితో సహా ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, యువకుడు అడవుల్లో తప్పిపోతే 8 రోజులు గడుస్తున్న ఇప్పటి వరకు సంబంధించిన అధికారులు స్పందించకపోవడం చాలా బాధాకరమని బాధితుని భార్య కండతడి పెడుతోంది. ఇప్పటికీ నా భర్త ప్రాణాలతో ఉన్నాడా లేడా తెలియడం లేదని, ఇంటి యజమాని దూరమైతే ఐదు మంది చిన్న పిల్లలను సాదడం ఎలా అని భోరున విలపిస్తోంది. ఏది ఏమైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి తన భర్త ఆచూకీ కోసం అధికారులు స్పందించాలని భార్య వేడుకుంటుంది.

# బీరుట్‌పై విరుచుకుపడుతున్న ఇజ్రాయెల్

- హెజ్‌బొల్లా అంతమే లక్ష్యంగా దాడులు
- భీకర దాడుల్లో 25మంది మృతి
- 127మందికి పైగా గాయాలు

**జనపదం,బ్యూరో :** లెబనాన్ రాజధాని బీరుట్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడులను తీవ్రతరం చేసింది. శనివారం జరిపిన దాడుల్లో 25 మంది మరణించారు. హెజ్‌బొల్లా అంతమే లక్ష్యంగా లెబనాన్‌పై ఇజ్రాయెల్ విరుచుకుపడుతోంది. హెజ్‌బొల్లాకు కంచుకోటగా భావించే రాజధాని బీరుట్ శివారు ప్రాంతాల్లో వైమానిక దాడులను తీవ్రతరం చేసింది. ఇప్పటికే నస్రల్లా సహా కీలక హెజ్‌బొల్లా నేతలను హతమార్చిన ఇజ్రాయెల్ మరింత మందిని మట్టుబెట్టినట్టు తెలిపింది. శనివారం రాత్రంతా ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 25 మంది ప్రాణాలు కోల్పోయారని, 127 మంది గాయపడినట్టు లెబనాన్ ఆరోగ్యశాఖ పేర్కొంది. ఒకవైపు భీకర దాడులు చేస్తూనే డ్రోన్లతో ఇజ్రాయెల్ సేనలు ఎప్పటికప్పుడు హెజ్‌బొల్లా లక్ష్యాలపై నిఘా పెట్టినట్టు తెలుస్తోంది. బీరుట్ శివారు ప్రాంతాలపై ఇప్పటి వరకు ఇజ్రా యెల్ జరిపిన దాడుల్లో గత రాత్రి జరిపినవే అత్యంత దారుణమైనవని లెబనాన్‌లో విధులు నిర్వహిస్తున్న పలువురు పాత్రికేయులు పేర్కొన్నారు. బాణసంచాలా మొదలైన దాడులు అంతకంతకూ పెరుగుతూ ఉదయం వరకూ భీకరంగా సాగాయని చెప్పారు.

### గ్రామాలు ఖాళీ చేయాలని హెచ్చరికలు..

దక్షిణ లెబనాన్‌లోని 25 గ్రామాల ప్రజలు తమ ఇళ్లను ఖాళీ చేయాలని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ హెచ్చరికలు జారీ చేసిన కొన్ని గంటల్లోనే భీకర దాడులు జరిగినట్టు తెలుస్తోంది. హెజ్‌బొల్లా స్థావరాలకు సమీపంలో ఉన్న వారు తమను తాము ప్రాణాపాయంలోకి పడేసుకున్నట్టేనని ఇజ్రాయెల్ పేర్కొంది. ప్రజలు తిరిగి ఎప్పుడు తమ తమ ఇళ్లకు రావొచ్చనేది చెబుతామని తెలిపింది. ఐడీఎఫ్ హెచ్చరికలతో ప్రజలు సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీశారు. గత రెండు వారాల్లో జరిగిన దాడులతో చాలా చోట్ల శిథిలాలు ఉండటం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతూ సేఫ్ జోన్‌లకు వెళ్లారు.

### కీలక నేతలు హతం

నస్రల్లా సహా కీలక హెజ్‌బొల్లా నేతలను ఇప్పటికే హతమార్చినట్టు ఇజ్రాయెల్ తెలిపింది. తాజాగా హెజ్‌బొల్లా కమాండర్ ఖాదర్ అలీ తవిల్‌ను మట్టుబెట్టినట్టు పేర్కొంది. అక్టోబర్ 7 నాటి ఘటనలకు సోమవారంతో సంవత్సరం పూర్తి కానున్న నేపథ్యంలో దక్షిణ ఇజ్రాయెల్‌లో భద్రతను కట్టుదిట్టం చేసినట్టు అక్కడి అధికారులు తెలిపారు మరోవైపు ఉత్తర లెబనాన్‌లో ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిలో హమాస్ లీడర్ సయిద్ అలీ సహా అతడి కుటుంబం ప్రాణాలు కోల్పోయినట్టు హమాస్ మిలిటెంట్ గ్రూప్ ప్రకటించింది.

# దుబాయిలో ఘనంగా బతుకమ్మ

- పాల్గొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు, విప్ ఆదిశ్రీనివాస్

**జనపదం, బ్యూరో :** ఎడారి దేశంలో తంగేడువనం విరబూసింది. తెలంగాణ సాంస్కృతిక వైభవం ఖండాంతరాలను దాటింది. దుబాయిలోని కైరో స్ట్రీట్ లోని ఇత్తిహాద్ స్కూల్ గ్రౌండ్ లో తెలంగాణ పర్యాటక, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో లెవల్ నెక్ట్స్ గోల్డ్ ఈవెంట్స్ దుబాయ్, గల్ఫ్ తెలంగాణ సంయుక్తంగా నిర్వహించిన బతుకమ్మ పండుగను సంబురంగా జరుపుకున్నారు. ముఖ్య అతిథులుగా పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు సాంప్రదాయ దుస్తుల్లో బతుకమ్మ ఆటపాటతో దుబాయ్ నగరం పులకించింది. ఆటపాటలు, కోలాటాల చప్పుళ్లు మార్మోగాయి. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలంగాణ ఆడ బిడ్డలకు ఈ సందర్భంగా మంత్రి జూపల్లి బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను గౌరవిస్తూ గల్ఫ్ దేశంలో నివసిస్తున్న మనవారంత ఒక కుటుంబంలా కలిసి పండుగ చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. తెలంగాణ ఉద్యమంలో బతుకమ్మ పాత్ర ఎంతో విశిష్టమైనది ఉద్యమ సందర్భాల్లో బతుకమ్మతో ఊరేగింపులు చేసిన తెలంగాణ ప్రజలు తమ అస్తిత్వాన్ని సగర్వంగా ప్రకటించుకున్నారని పేర్కొన్నారు. మన సంస్కృతి సంప్రదాయాలను భవిష్యత్తు తరానికి అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఇటు వంటి కార్యక్రమాలు దానికి ఎంతో తోడ్పడుతాయని చెప్పారు. విదేశాల్లో స్థిరపడ్డ ప్రవాస భారతీయులు మన దేశ ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాదులు వేస్తున్నారని అన్నారు. విద్య, వైద్య రంగాల్లో మెరుగైన, నాణ్యమైన విద్య, ఆధునిక సేవలు వంటి వాటికి పారిశ్రామికవేత్తలు, ఎన్ఆర్ఐలు చేయూత నివ్వాలని కోరారు. సామాజిక బాధ్యతగా పేద విద్యార్థులకు విద్య నందించేందుకు తమ వంతు సాయం చేయాలని సూచించారు.

# ముందస్తు పరీక్షలతో క్యాన్సర్ కట్టడి

- అవగాహన లేకే ప్రాణాలు కోల్పోతున్న రోగులు..
- గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ కార్యక్రమాలు హర్షణీయం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**జనపదం, హైదరాబాద్ సిటీ :** క్యాన్సర్ వ్యాధి వయస్సు, లింగ బేధం లేకుండా లక్షలాది మంది జీవితాలను కబలించివేస్తోందని, ముందసతు పరీక్షలతో క్యాన్సర్ ను కట్టడి చేయొచ్చని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ సంస్థ 'రన్ ఫర్ గ్రేస్ – స్క్రీన్ ఫర్ లైఫ్' నినాదంతో గచ్చిబౌలిలో నిర్వహించిన గ్రేస్ రన్ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో క్యాన్సర్ వ్యాధి లక్షలాది మంది పేదల జీవితాలను చిన్నాభిన్నం చేస్తోందని, దీనిని కట్టడి చేసేందుకు మనమంతా కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం సైతం డిజిటల్ హెల్త్ కార్డులను అందించడమే కాకుండా.. క్యాన్సర్ వ్యాధి కట్టడికి అనేక చర్యలు చేపట్టిందని ఆయన తెలిపారు. క్యాన్సర్ వ్యాధిని ప్రారంభ దశలో గుర్తిస్తే తగ్గించుకోవచ్చని డాక్టర్లు, నిపుణులు చెబుతున్నప్పటికి ప్రజల్లో అవగాహన లేకపోవడం వల్ల వ్యాధి ముదిరి ప్రాణాలను హరిస్తుదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ వారు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్‌లు చేస్తూ ప్రజలను క్యాన్సర్ బారిన పడకుండా అవగాహన కల్పించడంతో పాటు నిరుపేదలచికిత్సకు సహాయం అందించడం గొప్ప విషయమని అన్నారు. గ్రామీణ ప్రజలు క్యాన్సర్ బారిన పడితే.. చికిత్సకు డబ్బులు లేక వారి కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయన్నాయని వాపోయారు. గ్రేస్ ఫౌండేషన్ వారు గ్రామీణ ప్రాంతాల్లో క్యాన్సర్ మొబైల్ స్క్రీనింగ్ కార్యక్రమాలు నిర్వహించి గ్రామీణులకు క్యాన్సర్ పై అవగాహన కల్పించడమే కాకుడా, క్యాన్సర్ నిర్ధారణ అయిన వారికి చికిత్సకు అండగా నిలుస్తుండటంపై అభినందించారు. గ్రేస్ క్యాన్సర్ రన్ అనేది ఒక కార్యక్రమం కాదు. క్యాన్సర్ పై పోరాడే ఉద్యమమని ఆయన అన్నారు. అంతకు ముందు క్యాన్సర్ రన్ లో పాల్గొన్న మంత్రి డీజే టిల్లు పాటకు నృత్యం చేసి యువతను ఉత్సహపరిచడంతో పాటు జెండా ఊపి రన్ ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎండీ సజ్జనార్, గ్రేస్ ఫౌండేషన్ ప్రతినిధులు డాక్టర్ చిన్నబాబు సుంకవల్లితో పాటు వేలాదిగా యువత రన్ లో పాల్గొన్నారు.

# హర్మన్ ప్రీత్ కెప్టెన్ ఇన్నింగ్స్..

**జనపదం, స్పోర్ట్స్ :** మహిళల టీ20 వరల్డ్ కప్‌లో తొలి మ్యాచ్‌లోనే ఓటమి. రెండో మ్యాచ్‌లో గెలిస్తే తప్ప సెమీస్ చేరే అవకాశం లేదు. ఏరకంగా చూసినా టీమిండియాకు చావోరేవో మ్యాచ్. అలాంటి మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను స్వల్ప స్కోర్‌కే కట్టడి చేసిన భారత అమ్మాయిలు.. అతికష్టమ్మీద గట్టెక్కారు. ఓపెనర్ షఫాలీ వర్మ(35), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(29)ల అద్భుత పోరాటంతో ఆదుకున్నారు. మిడిల్ ఓవర్లలో జెమీమా రోడ్రిగ్స్(23) కీలక ఇన్నింగ్స్ ఆడింది. విజయానికి రెండు పరుగులు అవసరం అనగా హర్మన్‌ప్రీత్ రిటైర్డ్ హర్ట్‌గా పెవిలియన్ చేరినా.. సజన(4) లాంఛనం పూర్తి చేసింది. ఉత్కంఠ పోరులో 6 వికెట్ల తేడాతో జయభేరి మోగించిన టీమిండియా సెమీస్ ఆశల్ని సజీవంగా ఉంచుకుంది. తొలి టీ20 ప్రపంచ కప్ వేటలో భారత మహిళల జట్టు తొలి విజయం నమోదు చేసింది. న్యూజిలాండ్‌పై భారీ ఓటమి నుంచి తేరుకున్న టీమిండియా దాయాది పాకిస్థాన్‌పై అద్భుతంగా ఆడి బోణీ కొట్టింది. స్వల్ప ఛేదనలో టీమిండియా ఇన్నింగ్స్ నిదానంగా సాగింది. తొలి మ్యాచ్‌లో మాదిరిగానే ఈసారి కూడా భారత్‌కు శుభారంభం దక్కలేదు. ఇన్నింగ్స్ రెండో ఓవర్లోనే ఓపెనర్ స్మృతి మంధానా(7)ను వెనక్కి పంపింది. బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందొచ్చిన జెమీమా రోడ్రిగ్స్(23) చకచకా డబుల్స్ తీసి స్కోర్ బోర్డును నడిపించింది. కాస్త కుదురుకున్నాక షఫాలీ వర్మ (35) భారీ షాట్లు ఆడలేకపోయింది. పాక్ స్పిన్నర్లు కట్టుదిట్టంగా బంతులు వేయడంతో 10 ఓవర్లలో భారత్ 50 రన్స్ చేసిందంతే.. డ్రింక్స్ బ్రేక్ తర్వాత షఫాలీ గేర్ మార్చింది. బౌండరీలతో చెలరేగే క్రమంలో భారీ షాట్ ఆడిన ఆమె బౌండరీ వద్ద అలియా రియాజ్‌కు చిక్కింది. దాంతో రెండో వికెట్‌కు 43 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఇక ఆ తర్వాత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(29) అండగా రోడ్రిగ్స్..ధనాధన్ ఆడాలని చూసింది. కానీ, 16వ ఓవర్‌లోపాక్ సారథి సనా ఫాతిమా వరుస బంతుల్లో జెమీమా, రీచా ఘోష్(0)లను ఔట్ చేసి ఒత్తిడి పెంచింది. అప్పటికీ భారత జట్టు విజయానికి 26 బంతుల్లో 25 పరుగులు అవసరం.

### మెడ నొప్పితో రిటైర్డ్ హర్ట్

18 ఓవర్ తొలి బంతికే అంపైర్ దీప్తిని ఎల్బీగా ఔట్ ఇచ్చింది. అంతే.. భారత డగౌట్‌లోని అందరిలో టెన్షన్.. కానీ, రివ్యూ తీసుకోవడంతో దీప్తి బతికిపోయింది. నాలుగో బంతికి బౌండరీ కొట్టిన హర్మన్‌ప్రీత్ పాక్ ఆశలపై నీళ్లు చల్లింది. ఆ బౌండరీతో భారత విజయాన్ని తేలిక చేసిన ఆమె క్రీజులో పడిపోయి మెడనొప్పితో రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగింది. ఆ వెంటనే క్రీజులకొచ్చిన సంజన(4 నాటౌట్) బౌండరీతో జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించింది. దాంతో.. మెగా టోర్నీలో

### ఉత్కంఠ పోరులో భారత్ జయకేతనం

పాకిస్థాన్‌పై తన ఆధిపత్యాన్ని చాటుకున్న టీమిండియా సెమీస్ ఆశలు సజీవంగా ఉంచుకుంది.

### ఆదుకున్న దార్, సనా

టాస్ గెలిచి బ్యాటింగ్ తీసుకున్న పాక్‌కు మొదటి ఓవర్లోనే రేణుకా సింగ్ షాక్ ఇచ్చింది. ఓపెనర్ గుల్ ఫిరోజ్ (0)ను బౌల్డ్ చేసి ప్రత్యర్థిని వణికించింది. ఆ తర్వాత అరుంధతీ రెడ్డి (3/19), దీప్తి శర్మ కూడా వికెట్ల వేట కొనసాగించడంతో పవర్ ప్లేలోనే 33 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. ఓ వైపు వికెట్లు పడుతున్నా మునీబా(17) ధాటిగా ఆడే ప్రయత్నం చేసింది. కానీ.. శ్రేయాంక పాటిల్(2/12) తన మొదటి ఓవర్లోనే డేంజరస్ మునీబాను బోల్తా కొట్టించి పాక్‌ను మరింత కష్టాల్లోకి నెట్టింది. ఆ తర్వాత మాజీ కెప్టెన్ నిదా దార్ (28) ఆచితూచి ఆడుతూ అలియా రియాజ్(4), ఒమైమ్ సొహైల్(3)లతో కలిసి ఇన్నింగ్స్ చక్కదిద్దింది. భారత పేలవ ఫీల్డింగ్ కూడా వాళ్లకు కలిసొచ్చింది. రియాజ్ ఔటయ్యాక వచ్చిన కెప్టెన్ ఫాతిమా సనా(13) ఉన్నంతసేపు ధనాధన్ ఆడింది. శోభన వేసిన ఓవర్లో వరుసగా రెండు ఫోర్ల తో స్కోర్ 70 దాటింది. అయితే ఐదో బంతికి వికెట్ కీపర్ రీచా స్టన్నింగ్ క్యాచ్ పట్టడంతో ఆమె వెనుదిరిగింది. 71 వద్ద ఏడో వికెట్ పడగా.. ధార్, అరూబ్ షా(14 నాటౌట్)లు ధాటిగా ఆడారు. ఆఖరి ఓవర్లో దార్ ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన నష్ర సంధు ఓ బౌండరీతో జట్టు స్కోర్ 100 దాటించింది. దాంతో, టీమిండియాకు పాక్ 106 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.

# దక్షిణాఫ్రికాలో సత్తా చాటిన సుకన్య ..

- ఇంటర్నేషనల్స్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో రజత పతకం

**జనపదం, స్పోర్ట్స్ :** తెలంగాణ అమ్మాయి తేజావత్ సుకన్య అంతర్జాతీయ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్స్‌లో సత్తా చాటింది. దక్షిణాఫ్రికాలో జరుగుతున్న పోటీల్లో సుకన్య భారత దేశం తరపున మహిళల 76 కేజీల విభాగంలో పాల్గొని సుకన్య రజత పతకం సాధించింది. సుకన్యది మహబూబాబాద్ జిల్లా సీరోల్ మండలం రేకుల తండా శివారు జగ్యా తండా. కాగా, అంతర్జాతీయ పోటీల్లో పతకాలు సాధించడం సంతోషంగా ఉందని, భారత్ గర్వపడే ప్రదర్శన చేసేందుకు ఎల్లప్పుడూ కష్టపడతానని తెలిపింది. కాగా, అంతర్జాతీయ స్థాయిలో మానుకోట కీర్తి చాటిన సుకన్య ను స్థానికులు అభినందనలతో ముంచెత్తుతున్నారు.

# హైదరాబాదీలకు శుభవార్త.. మళ్లీ ఓటీఎస్

- నీటి బకాయిలపై వన్ టైమ్ సెటిల్ మెంట్
- ఆలస్య రుసుముతో పాటు వడ్డీ మాఫీ
- ఈనెల 1 నుంచి 31 వరకు అమలు
- పెండింగ్ బిల్లులన్నీ చెల్లిస్తేనే పథకం వర్తింపు

సద్వినియోగం చేసుకోవాలన్న వాటర్ బోర్డు

జనపదం, హైదరాబాద్: తాగునీటి బకాయిలు చెల్లింపునకు వాటర్ బోర్డు చక్కటి అవకాశం కల్పించింది. దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న బకాయిలపై విధించిన ఆలస్య రుసుము, వడ్డీని మాఫీ చేస్తూ వన్టైం సెటిల్మెంట్ స్కీమ్ (ఓటీ ఎస్)ను ప్రకటించింది. బకాయిలు పూర్తిగా చెల్లిస్తేనే ఈ పథకం వర్తిస్తుందని స్పష్టం చేసింది. ఈ మేరకు పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ ఉత్తర్వులు జారీచేశారు. దసరా పురస్కరించుకొని ఈ పథకాన్ని అందుబాటులోకి తీసుకురాగా... ఈనెల 1 నుంచి 31 వరకు అమల్లో ఉంటుందని పేర్కొన్నారు.

### బకాయిలు తగ్గించేందుకు..

వాటర్ బోర్డులో నీటి బకాయిలు అంతకంతకూ పెరిగిపోతుం డటంతో వాటిని తగ్గించేందుకు ఓటీఎస్ ను అమలు చేయాలని వాటర్ బోర్డు గతనెల 19న ప్రభుత్వానికి లేఖ రాయగా, అందుకు అనుమతులిస్తూ తాజాగా ఉత్తర్వులు వెలువరించింది. ఓటీఎస్ కింద వినియోగదా రులు తమ బకాయిలను ఎలాంటి ఆలస్య రుసుం, వడ్డీ లేకుండా చెల్లిం చవచ్చు. ఈ పథకాన్ని గతంలో 2016లో, మళ్లీ 2020లో అమలుచేశారు. ఒక్కో విడతలో రూ.400 కోట్లకుపైగా బకాయిలు వసూలు య్యాయి. అయితే నీటి బిల్లుల బకా యిలపై వడ్డీ మాఫీ కోసం అధికా రుల స్థాయిని బట్టి పరిమితి నిర్ణయించారు. మేనేజర్ స్థాయిలో రూ.2000 వరకు, డిప్యూటీ జనరల్ మేనేజర్ స్థాయిలో రూ.2001 నుంచి రూ.10,000 వరకు, జనరల్ మేనే జర్ స్థాయిలో రూ.10,001 నుంచి రూ.1,00,000 వరకు, చీఫ్ జనరల్ మేనేజర్ స్థాయిలో రూ.1,00,001 నుంచి అంతకంటే ఎక్కువ మాఫీ చేసే

అధికారం ఉంది. ఈ అవకా శాన్ని సద్వినియోగం చేసుకో వాలని వాటర్ బోర్డు ఎండీ ఆశోక్ రెడ్డి వినియోగదారులకు సూచించారు.

### ఓటీఎస్ నిబంధనలు ఇలా..

ఓటీఎస్ ఈనెల 31 వరకు మాత్రమే అమల్లో ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. నల్లా కనెక్షన్ యాక్టివ్ ఉన్నవారికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని, గతంలో ఓటీఎస్ ను విని యోగించుకోని వారు.. ఒకేసారి బిల్లు చెల్లిస్తే అలస్య రుసుము, వడ్డీ మాఫీ అవుతాయన్నారు. ఒకవేళ గతంలో ఓటీఎస్ ను విని యోగించుకుంటే 50శాతం మాఫీ అవుతుందన్నారు. ఈ పథకం కింద ప్రయోజనం పొందాలనుకునే వారు భవిష్యత్తులో 24 నెలలపాటు తప్పనిసరిగా క్రమంగా బిల్లులు చెల్లిస్తామని ఆఫిడవిట్ ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు.



# డియర్ యూత్ మాట్లాడుకోండి..

అధికారాన్ని కట్టబెడితే వాళ్లేమో పదవులతో కులుకుతున్నారని, మరి మనకిచ్చింది ఏంటని ప్రజలంతా ఎక్కడికక్కడ ఆలోచన చేయాలని హరీష్ రావు పిలుపునిచ్చారు. పండుగకు ఊరికి వస్తున్న కుటుంబ సభ్యులు, స్నేహితులతో రాష్ట్ర సర్కార్ పరిస్థితి, జరుగుతున్న మోసాలపై అంతా ముచ్చటించాలన్నారు. కాంగ్రెస్ చేసిన మోసాలను ఎవరికి వారుగా మరింత మందికి తెలిసేలా ప్రచారం పర్వం నెత్తికెత్తుకోవాలని ఆయన కోరారు. ప్రతి హామీని నిలబెట్టుకోవా లని లీడర్లకు ఇబ్బంది కలిగించేలా నిలదీత పర్వం మొదలు పెట్టాలని ఆకాంక్షించారు. అలయ్ బలయ్ తీసుకోవాలని, అన్ని ముచ్చట్లు చర్చకుపెట్టుకోవాలని ఆయన కోరారు.

ఇప్పటికైనా హస్తం పార్టీ మోసపూరిత వాగ్దానా లతో వెలగబెడుతున్న ఘనకార్యాన్ని ప్రతి ఒక్క తెలంగాణ వాదికి తెలిసేలా చేయాల్సిన బాధ్యత యూత్ పై ఉందన్నారు. రేవంత్ రెడ్డి కల్లబొల్లి మాటలతో పబ్బం గడుపుతున్న తీరును ఎండగ ట్టాలన్నారు. ఇంకోసారి ఏదిపడితే అది మాట్లా డడానికి లీడర్లు జంకేలా చర్యలు తీసుకోవాలని యువతను కోరారు.

### అతీగతి లేదు..

ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని ప్రగల్భాలు పలికారని హరీష్ గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి పదినెలలు గడిచినా అతీగతి లేకుండానే సాగుతోందన్నారు. నిరుద్యోగ భృతికి నీళ్లొదిలారని, నాలుగు వేలు దేవుడెరుగు కనీసం ఆ విషయాన్ని ఎక్కడా ప్రస్తావించకుండా కాలం నెట్టుకొస్తు న్నారన్నారు. ఉద్యోగం వచ్చినా రాకున్నా నెలకు నాలుగు వేల భృతి అందిస్తారు కాబట్టి జీవితాలు ఓ దిశ వైపు పోయే అవకా శాలున్నాయని భావించిన వారికి తీవ్ర నిరాశే మిగిలిందన్నారు.

# సోయిలేని సీఎం..

- రైతులే కాదు.. కౌలు రైతులూ ఆగమయ్యారు
- రేవంత్ కు అన్నదాతల చేతిలో దండన తప్పదు..
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- మంచిరోజులొస్తాయని కర్షకులకు ధైర్యం..

జనపదం, హైదరాబాద్ సిటీ: వందలాది రైతులు పిట్టల్లా రాలిపోతున్నా.. ముఖ్యమంత్రికి సోయి లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు.పాలం ఉన్న రైతులనూ పాట్టన బెట్టుకుంటున్నారు. కౌలుకు తీసుకున్న కర్షకులనూ కబళిస్తున్నా రన్నారు. ఒకే రోజు ముగ్గురు అన్నదాతలు బలికావడానికి ముమ్మాటికీ రైతు వ్యతిరేక రేవంత్ సర్కారే కారణమని విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఎక్స్ వేదికా రేవంత్ సర్కార్ పై నిప్పులు కురిపించారు. రైతుకు రక్షణ వలయంగా ఉన్న పథకాలను ఒక్కొక్కటిగా ఎగ్గొట్టడంతోనే వ్యవసాయంలో ఈ విలయం చోటు చేసు కున్నదన్నారు. ఫలితంగా వందలాది రైతులు చనిపోతున్నారన్నారు. దసరా పండుగ వేళ వ్యవసాయాన్ని దండుగలా మార్చిన సీఎం రేవంత్ కు రైతన్నల చేతిలో దండన తప్పదని హెచ్చరించారు. అన్నదాతలు ఆత్మస్థయిర్యం కోల్పోవద్దని కోరారు. ముంచే రోజులు తొందర్లోనే పోతాయని, మంచి రోజులు మళ్లీ వస్తాయంటూ ట్వీట్ చేశారు.

# ప్రక్షాళన ఎవరి కోసం..?

- బ్యూటిఫికేషన్ పేరుతో బడా బాబులకే..
- అడ్డుకోవడం మా పని కాదు..
- ముందు అఖిలపక్షం ఏర్పాటు చేయండి
- సీఎం రేవంత్‌కి ఎంపీ ఈటల ఘాటు లేఖ

**జనపదం, హైదరాబాద్ బ్యూరో:** బ్యూటిఫికేషన్ పేరిట మాల్స్ కట్టి పెద్దలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తావా? మూసీ ప్రక్షాళనకి మీ యాక్షన్ ప్లాన్ ఏమిటీ? డీపీఆర్ ఉందా? ఇళ్ళు కోల్పోతున్న వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఏంటి ? కోట్ల విలువ చేసే ఇల్లు తీసుకొని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తా అంటే ఎలా? సబర్మతి నది ప్రక్షాళనకి రూ. 2 వేల కోట్లు, నమో గంగ ప్రాజెక్ట్‌కి 12 ఏళ్లలో రూ. 22 వేల కోట్లు ఖర్చు పెడితే మూసీ ప్రక్షాళనకు మాత్రం రూ. లక్షా 50 వేల కోట్లు ఎందుకు ఖర్చు అవుతున్నాయి? ఇంతకీ ఈ ప్రాజెక్ట్ కాంట్రాక్ట్ ఎవరికి ఇచ్చారు ? ఈ ప్రశ్నలన్ని టికీ సమాధానం చెప్పాలని సీఎం రేవంత్ రెడ్డికి ఎంపీ ఈటల రాజేందర్ సవాల్ విసిరారు. సీఎం రేవంత్ రెడ్డికి ఈటల రాజేందర్ ఆదివారం బహిరంగంగా లేఖాస్త్రం సంధించారు.

తాను అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా పేదల అభ్యున్నతే లక్ష్యంగా కొట్లాడే వ్యక్తినని ఆయన స్పష్టం చేశారు. హైడ్రా సంస్థకు, హైదరాబాద్ ముంపు గురి కాకుండా చూసేందుకు, మూసీ ప్రక్షాళనకు, మూసీను కొబ్బరినీళ్లలా చేసేందుకు, ఎకలాజికల్ బాలన్స్ కాపాడడానికి, విదేశీ పక్షులు రావడానికి, చేపలు పెంచడానికి, పిల్లలు ఈతకొట్టేల చెరువులు తయారు చేయడానికి నేను వ్యతిరేకం కాదని ఆయన తన లేఖలో పేర్కొన్నారు. చెరువు కన్నతల్లి లాంటిదని ఆయన అభివర్ణించారు. కానీ హైదరాబాద్‌లో ఉన్న ఏ చెరువు కూడా పక్షులకు, చేపలకు నిలయంలాగా లేవని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కన్నతల్లి లాంటి ప్రేమను పంచి పాలలాంటి నీళ్లను ఇచ్చి జీవం పోసిన చెరువు ప్రస్తుతం భూగర్భంలో విషాన్ని నింపు తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇవి దుర్వాసనని స్తుందని చెప్పారు. ఆయా పరిసర ప్రాంతాల్లో ప్రజల రోగాలకు నిలయంగా మారిందన్నారు. ముందు ఈ చెరువుల్లో దుర్గంధాన్ని తొలగించాలని సీఎం రేవంత్ రెడ్డికి ఈ సందర్భంగా ఆయన సూచించారు. అలా చేయకుండా.. 4 దశాబ్దాల క్రితం ప్రభుత్వం ఇచ్చిన పట్టా భూముల్లో, ప్రభుత్వం అనుమతించిన లే అవుట్‌లలో ఇల్లు నిర్మించుకున్న నిరుపేద ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ మీరు చేస్తున్న అడ్డగోలు కూల్చివేతలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నానని ఎంపీ ఈటల కుండ బద్దలు కొట్టారు. వారు గొల్లున ఏడుస్తునా, కాళ్ళమీద పడ్డా వదిలిపెట్టడం లేదన్నారు.

### మూసీ ప్రక్షాళనను అడ్డుకోం

పదేళ్ళున్న కేసీఆర్ మూసీ ప్రక్షాళన చేస్తానని చేయలేదని గుర్తు చేశారు. మీరు మూసీ ప్రక్షాళన చేస్తానంటే అడ్డుకోమన్నారు. పట్టా భూములను కొనుక్కొని ఇల్లు కట్టుకొని ఉంటున్న వారిని బఫర్ జోన్ పేరుతో అక్రమంగా కట్టుకొని ఉంటున్నారని చిత్రీకరించడం దుర్మార్గమని ఆయన వ్యాఖ్యానించారు. పిడికెడు అక్రమ ఇళ్లను బూచిగా చూపి కోట్ల విలువ చేసే ఇళ్లను కూలగొడుతున్నారు. నివాసాలపై RB-X అని రాస్తున్నా రన్నారు. ఫణిగిరి కాలనీ, మారుతినగర్, చైతన్య పురి, ప్రజయ్ ఇంజనీరింగ్ సిండికేట్ లాంటి అపార్ట్‌మెంట్స్ అన్నీ పరిశీలించినట్లు వివరించారు. తాము ప్రజల మధ్య ఉన్నామన్నారు. మీకు తిరిగి చూసే టైం లేదన్నారు. తిరిగి చూసి.. వారి ఆక్రందనాలను ఆవిష్కరించే మమ్ముల్ని కాలకేయులుగా పోలుస్తున్నారని... ఇదేనా మీ భాష మీ సంస్కారం అంటూ సీఎం రేవంత్ రెడ్డిపై ఎంపీ ఈటల మండిపడ్డారు.

వారు కడుపు కాలి మాట్లాడుతున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. డబ్బులు ఇస్తే కాదు.. పేదల చిరకాల స్వప్నం ఇళ్లు.. దొంగలలాగా దాడి చేసి మీరు చేస్తున్న కూల్చివేతలు.. ఇస్తున్న నోటీసులు ప్రజల కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయని ఎంపీ ఈటల రాజేందర్ రాసిన లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. చట్టప్రకారం, రాజ్యాంగబద్ధంగా వ్యవహరిం చాలంటూ సీఎం రేవంత్‌కు ఈ సందర్భంగా ఈటల రాజేందర్ సూచించారు. ముఖ్యమంత్రిగా మీకేమీ అపరిమిత అధికారాలు లేవని గుర్తు చేశారు. పేదలను ఇబ్బంది పెట్టడానికి కాదు మీకు అధికారం ఇచ్చిందన్నారు. పేదల పక్షాన కొట్లడడం తన కర్తవ్య మని స్పష్టం చేశారు.

**పేదలను కొట్టి పెద్దలకు వేస్తారా..?**

బ్యూటిఫికేషన్ పేరిట మాల్స్ కట్టి పెద్దలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తావా? మూసీ ప్రక్షాళనకి మీ యాక్షన్ ప్లాన్ ఏమిటీ? డీపీఆర్ ఉందా? ఇళ్ళు కోల్పోతున్న వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఏంటి ? కోట్ల విలువ చేసే ఇల్లు తీసుకొని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తా అంటే ఎలా? సబర్మతి నది ప్రక్షాళనకి రూ. 2 వేల కోట్లు, నమో గంగ ప్రాజెక్ట్‌కి 12 ఏళ్లలో రూ. 22 వేల కోట్లు ఖర్చు పెడితే మూసీ ప్రక్షాళనకు మాత్రం రూ. లక్షా 50 వేల కోట్లు ఎందుకు ఖర్చు అవుతున్నాయి? ఇంతకీ ఈ ప్రాజెక్ట్ కాంట్రాక్ట్ ఎవరికి ఇచ్చారు ? ఈ ప్రశ్నలన్నిటికీ సమాధానం చెప్పాలని సీఎం రేవంత్ రెడ్డికి ఎంపీ ఈటల రాజేందర్ సవాల్ విసిరారు.

చెరువుల ఎఫ్టీఎల్, బఫర్ జోన్ నిర్ధారించకుండ కూల్చివేతలు ఎలా చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టా భూముల్లో ఇళ్ళు కట్టుకున్న వారికి ప్రత్యామ్నాయం ఏం చూపిస్తారో ప్రకటించాలని డిమాండ్ చేశారు. మీరు చేస్తున్న పనులు హైదరా బాద్ భవిష్యత్తుని, అభివృద్ధిని ప్రశ్నార్థకంలో పడేస్తు న్నాయన్నారు. అఖిలపక్షం ఏర్పాటు చేయండి.. మేం వస్తాం స్టేజీల మీద ప్రకటనలు చేయడం కాకుండా.. నిర్ణయాధికారం ఉన్న ముఖ్యమంత్రి అధ్యక్షతన అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేస్తే తాము ఎక్కడికైనా రావడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. తన కొట్లాట.. రూపాయి రూపాయి కూడబెట్టి నిర్మించు కున్న పేదల ఇళ్ళ కోసం మాత్రమేనని స్పష్టం చేశారు. మీరు లక్షన్నర కోట్లు పెట్టే ఖర్చు పేదల కోసమేనా ? అంత బడ్జెట్ మతలబు ఎంటో తేలాల్సిఉందన్నారు. ఈ విషయాలపై స్పష్టత వచ్చే వరకు తన ప్రతిఘటన ఉంటుందని పేర్కొన్నారు. పదవి ఉన్నా లేకున్నా తాను ప్రజల పక్షాన ఉండే వాడినని ఈ తెలంగాణ సమాజానికి తెలుసునని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు.

# ఆపరేషన్ గరుడ..?

## మావోయిస్టుల ఏరివేతలో కీలకం

- డ్రోన్లకు స్వస్తి.. గద్దలు, డేగలతో పని
- కాళ్లకు జీపీఎస్ ట్రాకర్లు, మెడకు కెమెరాలు
- మొయినాబాద్‌లో శిక్షణ..
- తెలంగాణ ఎస్ఐబీ నుంచే కీలక సమాచారం
- తాజా ఎన్‌కౌంటర్‌లో ఇన్ఫార్మర్లూ హతం?
- మావోయిస్టు ప్రభావిత సీఎంలో నేడు షా సమావేశం..
- ఢిల్లీకి వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**జనపదం, క్రైమ్ బ్యూరో:** జనపదం, హైదరాబాద్: ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు.. 9 నెలల్లోనే సుమారు 188 మంది మావోయిస్టులు ఎన్‌కౌం టర్‌లో హతమయ్యారు. వాతావరణం ప్రతికూ లంగా ఉన్నా.. కాకులు దూరని కారడవిలోనూ భద్రతా దళాలు లక్ష్యాన్ని ఛేదించగలిగాయి. అందుకు కారణం 'ఈగల్ స్కాడ్' అని పలువురు రిటైర్డ్ ఐపీఎస్‌లు చెప్తున్నారు. ఆర్మీ నుంచి తెలంగాణ పోలీసుల వరకు గరుడ దళాన్ని విరివిగా ఉపయోగిస్తున్నారు. పూర్వం లేఖలను పంపేందుకు పావురాలను, గూఢచర్యానికి డేగలను, వేటకు జాగిలాలను, ప్రయాణానికి అశ్వాలను వినియోగించినట్టే.. ఇప్పుడు 'ఆపరే షన్ కగార్'కు 'గరుడ దళం' సహకారం కేంద్ర హోంశాఖ తీసుకుంటున్నది. సంఘ విద్రోహ శక్తుల చర్యలను పసిగట్టేందుకు, రక్షణ, రహస్య ప్రదేశాల్లో ఎగిరే డ్రోన్లను పట్టుకునేందుకు 2020లో రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే తొలిసారిగా గద్దలకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. ఈ క్రమంలో మొయినాబాద్‌లో కొన్ని గద్దలకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. వాటిని మావోయి స్టుల ఏరివేతకు కేంద్ర హోంశాఖ ఉపయోగించిం దని పలువురు చెప్తున్నారు.

**ఎక్కడ నక్కి ఉన్నా.. పసిగట్టే 'కన్ను'**

కేంద్ర ప్రభుత్వం 2026 నాటికి దేశంలో మావోయిస్టు వ్యవస్థ ఉండొద్దనే లక్ష్యంతో చేపట్టిన 'ఆపరేషన్ కగార్'కు తెలంగాణలో శిక్షణ పొందిన, పొందుతున్న గద్దలను వినియోగించి నట్టు విశ్వసనీయ సమాచారం. దేశంలోనే తొలి సారిగా తెలంగాణ పోలీసులు ప్రత్యేకంగా ఈగల్ స్వాడ్ ను ఏర్పాటు చేసుకున్నారని, ప్రత్యేక శిక్షణ పొందిన గద్దలతో డ్రోన్ దాడులకు చెక్ పెట్టవ చ్చని నాటి డీజీపీ రవి గుప్తా ఓ సందర్భంలో చెప్పారు. వాటి కాళ్లకు జీపీఎస్ ట్రాకర్, మెడకు, రెక్కల కింద మైక్రో కెమెరాలు అమర్చినట్టు తెలిసింది. వీటి ద్వారానే మావోయిస్టుల సమాచారం తెలుసుకొని, పథకం ప్రకారం కాల్పులు జరిపారని పలువురు అంటున్నారు. వాసకాలం, చలికాలాల్లో వాతావరణం ప్రతికూ లంగా ఉన్నా.. పోలీసులు విజయం సాధించడా నికి ముఖ్యకారణం గరుడ దళమేనని స్పష్టం చేస్తున్నారు. కొంతకాలంగా కోవర్టు ఆపరేషన్లకు ప్రాధాన్యం ఇస్తున్న భద్రతా బలగాలు.. అదను చూసి ఇన్ఫార్మర్లనూ హతమారుస్తున్నట్టు తెలిసింది. తాజా ఎన్‌కౌంటర్‌లో కొందరు ఇన్‌ఫా ర్మర్లు కూడా ఉన్నట్టు చెప్తున్నారు.

**గరుడ దళం ప్రత్యేకతలివే..**

తొలుత నిఘాలో పావురాలకు శిక్షణ ఇద్దామని భావించినా అవి ప్రతికూల వాతావరణంలో ఎగ రలేకపోవడంతో డేగలవైపు మళ్లారు. డేగలు తుఫాను సమయంలోనూ మేఘాల కంటే ఎత్తులో వెళ్లి అవిశ్రాంతంగా పనిచేస్తాయి. దీంతో నల్లమల అడవుల్లోంచి రెండేళ్ల వయసున్న డేగ పిల్లలను తెచ్చి వాటికి మొయినాబాద్‌లోని ఇంటి గ్రేటెడ్ ఇంటెలిజెన్స్ ట్రైనింగ్ అకాడమీ (ఐఐ టీఏ)లోప్రత్యేక శిక్షణ ఇచ్చారు. సంఘ విద్రోహక శక్తులు ఉపయోగించే డ్రోన్లను సులభంగా గుర్తించేలా తర్ఫీదునిచ్చారు. అవి రెండు కిలోల దాకా బరువును కూడా కొన్ని కిలోమీటర్ల దూరం వరకు సులభంగా మోసుకురాగలవు. ప్రధాని, ఇతర ప్రముఖుల పర్యటనల సందర్భంగా డ్రోన్లపై నిషేధం ఉంటుంది. అలాంటి సందర్భాల్లో డేగలు నిఘా పెట్టి మరీ ఏవైనా డ్రోన్లు గాల్లోకి ఎగిరితే వాటిని పట్టుకొచ్చి, అధికారులకు అప్పగిస్తాయి. డేగలకు అమర్చే కెమెరాల ద్వారా నిషేధిత, అను మానిత ప్రాంతాల్లో వ్యక్తుల కదలికలను రికార్డ్ చేస్తుంటారు. ప్రపంచంలో ఇలాంటి డేగలు ఒక నెదర్లాండ్స్‌లోనే ఉన్నాయని నాటి డీజీపీ రవిగుప్తా మీడియాకు తెలిపారు.

# నేడు షా భేటీ..

- హస్తినాకు పయనమైన సీఎం రేవంత్..
- 2026 నాటికి మావోయిస్టుల తుడిచివేత లక్ష్యంగా పావులు..

మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల సీఎంలతో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా నేడు సమావేశం కానున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, బీహార్, ఛత్తీస్ గఢ్, జార్ఖండ్, ఒడిశా, మహారాష్ట్ర, మధ్య ప్రదేశ్ ముఖ్య మంత్రులు, ఇతర ఉన్నతాధికారులతో అమిత్ షా భేటీ కానున్నారు. 2026 మార్చి నాటికి వామపక్ష తీవ్రవాదాన్ని తుదముట్టించే దిశగా కేంద్రం కార్యాచరణను రూపొందిస్తోంది. దీనిలో భాగంగా సీఎం రేవంత్రెడ్డి ఆదివారం రాత్రి హస్తినకు వెళ్లారు. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్ అభయా రణ్యంలో ఆపరేషన్ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో తదుపరి కార్యాచరణ, రాష్ట్రాల భాగ స్వామ్యంపై చర్చించే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. అమిత్ షా నిర్వహించే ఈ సమావేశానికి ఆయా రాష్ట్రాల సీఎంలు, మంత్రులు హాజరుకానున్నారు.

# కొలువులు నింపుడే కీలకం..

**(మొదటిపేజీ తరువాయి)** ప్రతీ కుటుంబంలో ఆనం దం చూడాలని మరిన్ని నియామక పత్రాలు అంది స్తున్నట్లు తెలిపారు. ఇటీవల వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలకు ఎంపికన అభ్యర్థులకు హైదరాబాద్లోని శిల్పకళావేదికలో నియామక పత్రాలు అందించారు. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్, అగ్రికల్చర్ ఆఫీసర్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్, లైబ్రేరియన్స్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ లకు సంబంధించి ఎంపికైన 1635 మందికి నియామక పత్రాలు అందించారు. ఉద్యోగ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ వివిధ శాఖలకు సంబంధించి నోటిఫికేషన్లు ఇచ్చిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వడం బాధ్యతగా భావించలేదని అన్నారు. ఉద్యోగాల కోసం నిరీక్షించి నిరీక్షించి ప్రభుత్వంపై విశ్వాసం కోల్పోయే పరిస్థితి నెలకొందని చెప్పారు. 1635 మందికి ఇప్ఉడు ఉద్యోగ నియామక పత్రాలు అందించడం సంతోషంగా ఉందని, మీ చప్పట్లలో మీ సంతోషం, మీ కుటుంబ సభ్యుల ఆనందం కని పిస్తుందని చెప్పారు. ఏళ్లుగా నిరీక్షించిన మీ కల ఇవాళ సాకారమవుతోందని, వందలాది మంది ఆత్మ బలిదానాలతో తెలంగాణ ఏర్పడిందని, అలాంటి తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కాబో తున్నారని అన్నారు. ఉద్యోగ నిర్వహణలో బాధ్యతా యుతంగా వ్యవహరించాలని గుర్తుచేశారు.

### ఎవరిని ఆదర్శంగా తీసుకుంటారో...

లక్షలాది మంది హైదరాబాద్ ప్రజల దాహార్తిని తీర్చిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య లాంటి ఇంజనీ ర్లను మీరు ఆదర్శంగా తీసుకోవాలని సీఎం రేవం త్రెడ్డి సూచించారు. హైదరాబాద్ లో వందల ఏళ్ల క్రితం నిర్మించిన అద్భుత కట్టడాలున్నాయని, వందే ళ్ల అనుభవం ఒకవైపు.. పదేళ్ల దుర్మార్గం మరోవైపు కనిపిస్తుందని, కాళేశ్వరం కట్టినవారిని ఆదర్శంగా తీసుకుంటారో... నాగార్జున సాగర్ కట్టిన వారిని ఆదర్శంగా తీసుకుంటారో ఆలోచించుకోండి అని సీఎం చెప్పారు. తన కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇచ్చుకున్న కేసీఆర్... 2015లో నోటిఫికేషన్లు ఇచ్చి న వాళ్ళకు ఎందుకు ఉద్యోగాలు ఇవ్వలేదని నిలదీ శారు. తెలంగాణ ఉద్యమం గొప్పతనాన్ని.. విద్యార్థి నిరుద్యోగుల త్యాగాలను కేసీఆర్ కవచంగా మార్చు కున్నారని, ఇప్పుడు ముసుగు తొలగిపోవడంతో ఇ ష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. అక్టోబర్ 9న 11,063 ఉపాధ్యాయ నియామక పత్రా లు అందించబోతున్నామని సీఎం రేవంత్రెడ్డి ప్రక టించారు. దసరా పండగ నేపథ్యంలో తెలంగాణలో ప్రతీ కుటుంబంలో ఆనందం చూడాలని కోరుకున్నా మన్నారు. ఇది కేవలం ఉద్యోగం మాత్రమే కాదు అని, ఇది భావోద్వేగం అంటూ చెప్పారు. ఉద్యోగం లో చేరిన నాటి నుంచి పదవీ విరమణ వరకు ఒకే విధంగా వ్యవహరించాలని సీఎం కోరారు.

### మూసీ ప్రక్షాళన చేసి తీరతాం..

మూసీ పరీవాహక ప్రజలు దశాబ్దాలుగా మురికిలోనే ఉండాలా అని సీఎం రేవంత్రెడ్డి ప్రశ్నించారు. పదేళ్ల నిర్మాణాలపై చర్చకు సిద్ధమా అని బీఆర్ఎస్ నాయ కులకు సవాల్ విసిరారు. డీపీఆర్ లేకుండానే రూ.లక్షన్నర కోట్లు పోసి కట్టిన కాళేశ్వరం వారి హయాంలోనే కూలిపోయిందని, మలన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ నాణ్యతపైనా నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని స్పష్టం చేశారు. మూసీ అంటే మురికి కూపమనే పేరు స్థిరపడిందని, ప్రజలు నిరాశ్రయులు అవుతారని ప్రాజెక్టులు కట్టకుండా ఉంటారా? అని ఆయన ప్రశ్నించారు. మూసీ పరీవాహక ప్రజలు దశాబ్దాలుగా మురికిలోనే ఉండాలా అని నిలదీశారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా మూసీ ప్రక్షాళన చేసి తీరతామని, పిల్లలకు నది పేరు పెట్టేలా అద్భుతంగా పునర్ నిర్మిస్తామని తెలిపారు. మూసీ నిర్వాసితులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని స్పష్టం చేశారు. లండన్‌లో థేమ్స్.. అమెరికాలో హడ్సన్ రివర్.. గుజరాత్‌లో సబర్మతి రివర్‌ఫ్రంట్ తరహాలో మూసీని ప్రక్షాళన చేస్తానన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు గంగ, యమున, సరస్వతి అనే పేర్లతో పాటు మూసీ పేరు కూడా పెట్టే విధంగా ఆ నదిని ప్రక్షాళన చేస్తానని ప్రకటించారు. ప్రాజెక్టుల కోసం ఇప్పటివరకూ రాష్ట్రంలో భూసేకరణ జరగలేదా? అని ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో ప్రతిపక్షాలు తమ రాజకీయం కోసం ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నాయని మండిపడ్డారు. గత ప్రభుత్వం రూ.7 లక్షల కోట్లు అప్పులు చేసిందని, మరో 10 వేల కోట్లు ఖర్చు చేసిమూసీ బాధితులను ఆదుకో లేమా అని ప్రశ్నించారు.

**అందుకే అడ్డుకుంటున్నారు**

బీఆర్ఎస్ నేతల పదేళ్ల దోపిడీ బయటపడుతుందన్న భయంతోనే అభివృద్ధి జరగకుండా అడ్డుపడుతున్నా రని సీఎం రేవంత్రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలు మూసీ ఒడ్డున క్యాట్‌వాక్ చేయకుండా వారం రోజులు అక్కడే నివసిస్తే అక్కడి ప్రజల ఇబ్బందులు తెలుస్తాయని సూచించారు. ప్రజలు నిరాశ్రయులు అవుతారని ప్రాజెక్టులు కట్టకుండా ఉంటారా? అని ప్రతి పక్షాలను ప్రశ్నించారు. వీలైతే నిర్వాసితులను ఎలా ఆదుకోవాలో సలహాలు, సూచనలు ఇవ్వాలి తప్ప అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదన్నారు.

### ఈటల అంగి మారింది

బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ అంగి మారింది కానీ.. వాసన మారలేదని సీఎం రేవంత్రెడ్డి సెటైర్లు వేశారు. హరీష్, కేటీఆర్ మాట్లాడిందే ఈటల మాట్లాడుతున్నారని, ఈటల ఇప్పటికైనా పేదల వైపు నిలబడాలని.. ఇలా వచ్చి అలా వెళ్లడం కాదు అని, ధైర్యం ఉంటే కేసీఆర్, హరీష్, ఈటల మూసీ పరివాహక నివాసాల్లో వారం రోజులు ఉండాలని, అప్పుడే వాళ్ల కష్టాలు, బాధలు తెలుస్తాయన్నారు.

# దసరా గిఫ్ట్..

**(మొదటిపేజీ తరువాయి)** యోచనలో కాంగ్రెస్ కసరత్తు కొనసాగుతోంది. అదేవిధంగా ఎమ్మెల్యేలకు కూడా కొన్ని కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు ఇచ్చే ఆలోచన ఉన్నట్లు తెలుస్తోం ది. ప్రధానంగా ఆర్టీసీ, పౌరసరఫరాలు, మూసీ సుందరీకరణ కార్పొరేషన్ తదితర ముఖ్యమైన పదవులు ఎమ్మెల్యేలకు ఇస్తారన్న ప్రచారం కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతోంది. బీసీ కమిషన్‌ను అధిక జనాభా కలిగిన బీసీ వర్గాలతో ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. ప్రధానంగా ఇందులో మున్నూరు కాపు, యాదవ, గౌడ్, ముదిరాజులు లాంటి అత్యధిక జనాభా కలిగిన వారు ఛైర్మన్, సభ్యులు ఉండేట్లు చూడాలని యోచిస్తోంది. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ఉస్మానియా విశ్వవిద్యాలయం యువతకు భాగస్వామ్యం కల్పించాలని పార్టీ రాష్ట్ర నాయకత్వం భావిస్తోంది.

**పీసీసీ కమిటీతో పాటు..**

పీసీసీ నూతన అధ్యక్ష ఎంపిక పూర్తయింది. ముందుగా అనుకున్నట్టే పీసీసీ నియామకం తర్వాత పూర్తిస్థాయి కార్యవర్గాన్ని భర్తీ చేస్తున్నారు. దీనికోసం పార్టీనేతల జాబితా సిద్ధం చేస్తున్నారు. కొందరి పేర్లతో కూడిన జాబితాను పార్టీ నాయకులు సిద్ధం చేశారని తెలుస్తోంది. ఆ జాబితాపై సీఎంతో చర్చించిన తరువాతనే పూర్తి వివరాలు బహిర్గతం అవతాయని స్పష్టం చేస్తున్నారు.

**సమాచార కమిషన్ల జాబితా..**

సమాచార హక్కు చట్టం ప్రధాన కమిషనర్తో పాటుగా 9 మంది కమిషనర్లను ఒకేసారి నియమించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. దీనికోసం ఇప్పటికే అప్లికేషన్లు తీసుకున్నారు. వీటిలో అర్హుల జాబితా తీసుకున్నారు. దాదాపు 38 మందితో అర్హుల జాబితా సీఎంకు ఇచ్చినట్లు ప్రచారం జరుగుతున్నది.

**గ్రంథాలయ సంస్థకు ఛైర్మన్లు..**

రాష్ట్రంలో పలు జిల్లాల గ్రంథాలయ సంస్థలకు ఛైర్మన్లను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 13 జిల్లాలకు ఛైర్మన్‌లను నియమించింది. త్వరలో మిగతా జిల్లాలకు గ్రంథాలయ సంస్థలకు ఛైర్మన్‌లను నియమిస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. తెలంగాణలో బతుకమ్మ పండుగకు ముందు నామినేటెడ్ పోస్టుల భర్తీ జాతర మొదలైంది. తాజాగా రాష్ట్రంలోని పలు జిల్లాల గ్రంథాలయ సంస్థలకు ఛైర్మన్‌లను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 13 మందికి ఈ జాబితాలో చోటు దక్కింది. కులాల వారీగా చూసుకుంటే ప్రకటించిన వాటిలో రెడ్డి సామాజికవర్గం నుంచి ఐదు మంది ఉండగా.. గౌడ్ సామాజికవర్గం నుంచి ఇద్దరు.. ముస్లిం నుంచి ఒకరికి పదవులు లభించాయి. త్వరలో మిగతా జిల్లాలకు గ్రంథాలయ సంస్థలకు ఛైర్మన్‌లను నియమిస్తామని కాంగ్రెస్ ప్రకటించింది.

# సాగనంపిన సీతక్క..

**గాంధీ ఆస్పత్రి నుంచి జైనూర్ ఆదివాసి మహిళ డిశ్చార్జ్**
**చీర, నగదుతో బాధితురాలికి మనోధైర్యం**
**కావాల్సినవి సమకూర్చిన మంత్రి**
**ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ**

**జనపదం, ఆసిఫాబాద్ :** కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలో ఆటో డ్రైవర్ దాడిలో తీవ్రంగా గాయపడి, గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆదివాసీ మహిళకు చికిత్స పూర్తి కావడంతో డిశ్చార్జ్ చేశారు. ఆదివారం ఉదయం మంత్రి సీతక్క, కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్చార్జి ఆత్రం సుగుణక్క, డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వ ప్రసాద్ రావు ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. నగదు, చీరను అందించి వాహనంలో ఆమెను స్వగ్రామానికి పంపించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ... బాధితురాలి ఆరోగ్యం కుదుటపడడంతో అన్ని విధాలా వైద్య పరీక్షలు చేసిన వైద్యులు డిశ్చార్జ్ చేశారన్నారు. ఆదివాసీ ఆడబిడ్డపై దాడి జరిగిందని తెలియగానే ప్రభుత్వం వెంటనే స్పందించిందన్న సీతక్క బాధితురాలికి అండగా నిల్చుని అన్ని విధాలా ఆదుకుంటామని తెలిపారు.

**అసలేం జరిగిందంటే..?**

ఆసిఫాబాద్ జిల్లాలోని జైనూరులో షేక్ మగ్దూం అనే ఓ ఆటోడ్రైవర్ కొన్ని రోజుల కిందట ఓ ఆదివాసీ మహిళపై లైంగిక దాడికి యత్నించి, ఆమెను తీవ్రంగా గాయపర్చినట్లు ఆరోపణలున్నాయి. జైనూరు ఘటన అనంతరం జరిగిన పరిణామాలపై ఆదివాసీ ప్రతినిధులతో సమావేశం నివేదికను మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మబొజ్జు సీఎం రేవంత్ రెడ్డికి వివరించారు. ఆదివాసీల సమస్యల పరిష్కారానికి ఏం చర్యలు తీసుకోవాలో ప్రభుత్వం ఫోకస్ చేసిందని చెప్పారు.

**కొన్ని రోజులపాటు జైనూరులో 144 సెక్షన్..**

ఘటన అనంతరం బాధితురాలికి న్యాయం చేయాలని ఆదివాసీలు పోరాటానికి దిగారు. పోలీసులు తమకు న్యాయం చేయడం లేదంటూ పెద్ద సంఖ్యలో రోడ్లపైకి వచ్చి నిరసన తెలపడంతో పోలీసు శాఖ, ప్రభుత్వం అప్రమత్తమైంది. ఆ సమయంలో కొన్ని రోజులపాటు శాంతి భద్రతల పరిరక్షణతో పాటు ఎలాంటి అవాంఛిత ఘటనలు జరగకుండా జైనూరులో 144 సెక్షన్ చేశారు. దాంతో ఇతర ప్రాంతాలవారు జైనూరు వెళ్లడానికి అనుమతి లేదని అప్పటి ఎస్పీ తేల్చి చెప్పారు. జైనూరు టౌన్ చుట్టూ చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. తప్పు చేసిన వారిని కఠినంగా శిక్షిస్తామని, అయితే ఎలాంటి తీవ్ర నిర్ణయాలు తీసుకోవద్దని ఆదివాసీ సంఘాలను, బాధిత మహిళ కుటుంబాలకు పోలీసులు సూచించారు.

# పోటీని తట్టుకునేలా బోధన..

- ప్రమాణాలతో యంగ్ ఇండియా స్కూళ్లు
- ఆ రేంజ్ లో విద్యా బోధన పెంచుతాం..
- అన్నింటికీ విద్యార్థులను సిద్ధం చేస్తాం..
- రూ.5 వేల కోట్లతో రెసిడెన్షియల్ స్కూళ్లు..
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్..పై సమావేశం
- ఈనెల 11న పాఠశాలలకు శంకుస్థాపనకు నిర్ణయం..
- ఒక్కో పాఠశాలకు సుమారు రూ.26 కోట్ల ఖర్చు
- ఇప్పటికే 24 నియోజకవర్గాల్లో స్థలాల ఎంపిక..
- అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా స్కూళ్లు
- నిర్మాణానికి డిజైన్లు ఖరారు
- సమావేశానికి హాజరైన మంత్రులు పొన్నం, కోమటిరెడ్డి వెంకట రెడ్డి

**జనపదం, హైదరాబాద్ బ్యూరో :** రాష్ట్రంలో ఐదువేల కోట్లతో ఈ సంవత్సరం ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నామని డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. బలహీన వర్గాలకు ప్రాథమిక స్థాయి నుంచే నాణ్యమైన విద్య అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇందులో భాగంగా పాఠశాలల్లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ కాన్సెప్ట్ ను ప్రారంభిస్తున్నామన్నారు. సచివాలయంలో రెసిడెన్షియల్ స్కూల్స్ డిజైన్లను ఆదివారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రులు కోమటి రెడ్డి వెంకట రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీఎస్ శాంతి కుమారి తదితరులు కలిసి భట్టి విక్రమార్క మాట్లాడుతూ, ప్రపంచంతో పోటీ పడేలా రాష్ట్ర విద్యార్థులను సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ తో 20-25 ఎకరాల్లో రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ఒక్కో పాఠశాలకు రూ. 25 నుంచి రూ.26 కోట్ల ఖర్చు అవుతుందన్నారు. ఇప్పటి వరకు చాలా రెసిడెన్షియల్ స్కూళ్లకు పక్కా భవనాలు లేక అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయన్నారు. ఈ ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ లో ఒకటోతరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే దగ్గర బోధన చేస్తున్నామన్నారు. గత మూడు నెలలుగా ఈ రెసిడెన్షియల్ స్కూళ్లపై కసరత్తు చేశామన్నారు.

**సౌకర్యాలు లేక విద్యార్థుల ఇబ్బందులు..**

ప్రస్తుత రెసిడెన్షియల్ స్కూలల్లో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని భట్టి పేర్కొన్నారు. 662 స్కూళ్లకు పక్కా భవనాలు లేవన్నారు. అవన్ని అద్దె భవనాలేనన్నారు. అందుకే ఈ ఏడాది రూ. 5 వేల కోట్ల రూ రెసిడెన్షియల్ స్కూళ్లకు ఖర్చు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందులో అన్ని వర్గాల వారికి అడ్మిషన్లు ఉంటాయని స్పష్టం చేశారు. పేద పిల్లలు తాము ఏదో మిస్సవుతున్నామని అనుకోకూడదని అన్నారు. అవసరమైతే ప్రతి రెసిడెన్షియల్ పాఠశాలలో స్మాల్ హంపీ థియేటర్ కడుతామన్నారు. ఈనెల 11న సాధ్యమైనన్ని పాఠశాలలకు శంకుస్థాపన చేస్తామన్నారు. దీని కోసం ఇప్పటికే 24 నియోజకవర్గాల్లో స్థలాలు ఎంపిక పూర్తయిందని వెల్లడించారు. వీలైనంత త్వరగా ప్రతి నియోజకవర్గంలో ఒక రెసిడెన్షియల్ పాఠశాలను ప్రారంభిస్తామన్నారు. రానున్న 7 నెలల్లో రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం పూర్తి చేయాలని టార్గెట్గా పెట్టుకున్నామన్నారు. రెసిడెన్షియల్ పాఠశాల నియామకం సొసైటీ ద్వారా జరుగుతుందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు నిర్మించి, వీటిని అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దుతామన్నారు. ఇవి దేశానికే ఆదర్శంగా ఉంటాయన్నారు. దసరా కంటే ముందే నిర్మాణానికి భూమి పూజ చేస్తామన్నారు. గురుకులాలు, రెసిడెన్షియల్ స్కూళ్లకు భారీగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. త్వరగా నిర్మాణ పనులు పూర్తిచేయాలని ఇప్పటికే సీఎం ఆదేశించారన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఆయా నియోజకవర్గాల్లో ఉండే ఉష్ణోగ్రతలు, గాలి వాటం, వాతావరణ పరిస్థితులను పరిగణలోకి తీసుకొని ఈ ఆధునిక రెసిడెన్షియల్ భవనాల నిర్మాణం జరుగుతుందన్నారు. గ్రీన్ ఎనర్జీని వినియోగించుకోవడంతోపాటు అన్ని వర్గాల వారు కలిసి ఒక చోట ఓ కుటుంబములా చదువుకునే లా ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ తో భవనాల నిర్మాణం జరుగుతుందన్నారు. కేవలం చదువుల పేరిట ఒత్తిడి సృష్టించే వాతావరణ కాకుండా క్రీడలు, వినోదం వంటివి విద్యార్థులకు అందిస్తామన్నారు. విద్యార్థులకు ఏ కొరత లేకుండా చూసే కార్యక్రమంలో భాగంగా థియేటర్ నిర్మించి శాటిలైట్ ద్వారా పిక్చర్స్ సైతం ప్రదర్శించే ఆలోచనలో ఉన్నామన్నారు. పేద వర్గాల వారు వారి బిడ్డలను ఈ పాఠశాలల్లో చేర్పించి విరివిగా ప్రచారం నిర్వహించాలని కోరారు.

**సౌకర్యాలు పెంచడమే ధ్యేయం : మంత్రి పొన్నం**

రాష్ట్ర బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటికే రూ. 1100 కోట్ల వ్యయంతో అమ్మ ఆదర్శ పాఠశాలల పథకాన్ని చేపట్టామని తెలిపారు. ఏవిధమైన ఇబ్బందులు లేకుండా రాష్ట్రంలో ఉపాధ్యాయుల బదిలీలని చేపట్టామని అన్నారు. రాష్ట్రంలోని అన్ని పాఠశాలలకు ఉచిత విద్యుత్ సౌకర్యం అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మాట్లాడుతూ, రాష్ట్ర విద్యా రంగ చరిత్రలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు ఒక నూతన అధ్యాయమని అన్నారు. ఈ పాఠశాలలో చదివే పిల్లలకు ఉజ్వల భవిష్యత్ ఉంటున్నాడని అన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ముఖ్య కార్యదర్శులు బుర్రా వెంకటేశం, ఎన్. శ్రీధర్, ప్రభుత్వ చీఫ్ విప్ బీర్ల ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

**దసరా కానుక ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు..**
**రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న దసరా కానుక ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ అన్నారు. "రాష్ట్రంలో చదువుతున్న 6 లక్షల మంది పిల్లల భవిష్యత్తు కోసం ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయమన్నారు. ఇది గత పది నెలలుగా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేశామని కానీ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణం ఎంతో గొప్ప కార్యక్రమం అన్నారు. రాష్ట్రంలో విద్యార్థులు సౌకర్యాలలేమితో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. 600 మంది విద్యార్థులు 20 రూముల్లో ఉంటున్నారు.. 20 మందికి ఒక టాయిలెట్ కూడా లేని పరిస్థితులు ఉన్నాయన్నారు. ఇప్పుడు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మించి రాష్ట్రంలో విద్యా విప్లవం సృష్టించబోతున్నామన్నారు.**

# మోస్ట్ వాంటెంట్ సైబర్ నేరగాళ్ల ముఠా అరెస్ట్

- రూ.1.61 కోట్ల నగదు సీజ్
- రాష్ట్రంలో 45.. దేశ వ్యాప్తంగా 319 పైగా కేసులు..

**జనపదం, క్రైమ్ :** టెక్నాలజీని ఉపయోగించుకొని కొందరు కేటుగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. ఈజీ మనీకి అలవాటు పడి అమాయకులే టార్గెట్ గా మోసాలు చేస్తున్నారు. ఇలా సైబర్ మోసాలకు పాల్పడుతున్న మోస్ట్ వాంటెడ్ ముఠాను తాజాగా హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. కర్ణాటక, రాజస్థాన్, మహారాష్ట్రలో స్పెషల్ ఆపరేషన్ చేపట్టిన హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కేటుగాళ్లను అరెస్టు చేశారు. ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి మొత్తం18 మంది సైబర్ నేరగాళ్లను అదుపులోకి తీసుకున్నారు. వీరిపై ఒక్క రాష్ట్రంలోనే 45కు పైగా కేసులు ఉండటం గమనార్హం. దేశవ్యాప్తంగా మరో 319 కేసులు ఉన్నట్లు వెల్లడించారు

**రూ.1.61 కోట్ల నగదు సీజ్**

దేశవ్యాప్తంగా కొరియర్, స్టాక్ మార్కెట్ పెట్టుబడి, సెక్స్ టార్షన్, సీబీఐ, ఈడీ, డ్రగ్స్ పేరుతో వీరు మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితుల బ్యాంకు అకౌంట్లోని రూ.1.61 కోట్ల నగదును సీజ్ చేశారు. వారి వద్ద నుంచి రూ.5 లక్షల నగదు, 26 సెల్‌ఫోన్లు, 16 ఏటీఎం కార్డులను సైతం స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో నమోదైన కేసుల్లో.. బాధితుల నుంచి ఈ కేటుగాళ్లు రూ.6.94 కోట్లు కొట్టేసినట్లు పోలీసులు తెలిపారు. ముంబై కేంద్రంగా వీరు సైబర్ నేరాలకు పాల్పడినట్లు గుర్తించారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్ వస్తే స్పందించవద్దని నగర సీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. సైబర్ నేరగాళ్లు చెప్పే మాటలను ఎట్టి పరిస్థితిలో నమ్మెద్దని వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

**వీరితో జాగ్రత్త..**

ఇక చోరీలకు పాల్పడే తమిళనాడు ముఠాలు రాష్ట్రంలో సంచరిస్తున్నాయని పోలీసులు హెచ్చరించారు. బ్యాంకులు, ఏటీఎం కేంద్రాలు, ట్రాఫిక్ కూడళ్లను ఎంపిక చేసుకొని చోరీలు చేస్తున్నట్లు తెలిపారు. భార్యభర్తలుగా నటించి దొంగతనాలు చేస్తున్నట్లు చెప్పారు. ఒంటిపై ఉమ్మిపడిందని, వెహికల్ టైర్లలో గాలిపోయిందంటూ ఏమార్చి వారికి తెయికుండానే వస్తువులు కాజేస్తునట్లు తెలిపారు. ఈ తరహా ముఠాలు సుమారు 10 వరకు నగరంలో సంచరిస్తున్నట్లు తెలిపిన పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# 'రెవెన్యూ' చాలా కీలకం..

- ప్రభుత్వానికి కళ్లు, చెవులు ఆ శాఖ అధికారులే..
- ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా వ్యవస్థ ప్రక్షాళన
- రెవెన్యూ ఉద్యోగుల జాబ్ చార్టుకు కమిటీ
- దసరాలోపే ఎన్నికల బదిలీల తహసీల్దార్లపై నిర్ణయం
- రెవెన్యూ గ్రామానికో అధికారి
- కొత్త చట్టానికి ముందే తుది నిర్ణయం
- ప్రభుత్వ భూముల పరిరక్షణలో రాజీపడం
- దేశానికి రోల్ మోడల్ గా తెలంగాణ కొత్త రెవెన్యూ చట్టం
- యాచారం, తిరుమలగిరి మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు
- స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లతో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖాముఖి

**జనపదం, బ్యూరో :** దేశానికి రోల్ మోడల్ గా రాష్ట్రంలో త్వరలో కొత్త రెవిన్యూ చట్టాన్ని తీసుకరాబోతున్నామని రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం రూపొందుతున్న ఈ చట్టం ప్రక్రియ తుది అంకానికి చేరుకుందన్నారు. ప్రజలు మేలు చేసే అన్ని అంశాలు చట్టంలో ఉండే విధంగా పలు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. కాగా ప్రజల చెంతకు అధికార వ్యవస్థను తీసుకొచ్చేందుకు ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. కొత్త చట్టం ద్వారా పదేళ్ల ప్రజల కష్టాలు, బాధలకు ముగింపు పలుకనున్నామని స్పష్టం చేశారు.

రాష్ట్రంలోని 272 మంది స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లతో ఆదివారం ఎంసిఆర్ హెచ్ఆర్డిలో ఆయన ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ , గత ప్రభుత్వం అమలు చేసిన ధరణితో సామాన్య ప్రజలు, రైతులు ఇబ్బందులు అభద్రతాభావానికి గురయ్యారన్నారు. వారు ఎదుర్కొన్న రెవెన్యూ సమస్యల నుంచి విముక్తి కల్పించాలన్న లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం నూతన రెవెన్యూ చట్టానికి శ్రీకారం చుట్టిందన్నారు. కాంగ్రెస్ పార్టీ విధానాలను విశ్వసించి అధికారం అప్పగించిన ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోనేవిధంగా రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేస్తున్నామన్నారు. సామాన్యునికి అందుబాటులో ఉండేలా రెవెన్యూ సేవలను తీసుకురాబోతున్నాం. ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమించే ప్రక్రియను కొత్త రెవెన్యూ చట్టం రాకముందే చేపడతామన్నారు.

గత ప్రభుత్వం తొందరపాటు నిర్ణయాలతో రెవెన్యూ వ్యవస్థను భ్రష్టు పట్టించిందని విమర్శించారు. సామాన్యులకు రెవెన్యూ సేవలను దూరం చేసిందన్నారు. ఇటువంటి పరిస్థితి పునరావృతం కాకుండా మా ప్రభుత్వం ఉద్యోగులను, మేధావులను, ఇలా అందరినీ సంప్రదించి వారి సూచనలను, సలహాలను స్వీకరించామన్నారు. నల్గొండ జిల్లాలోని తిరుమలగిరి, రంగారెడ్డి జిల్లాలోని యాచారం మండలాలలో పైలట్ ప్రాజెక్ట్ గా కొత్త రెవిన్యూ చట్టాన్ని అమలు చేశామన్నారు. ఈ సందర్భంగా తలెత్తిన సమస్యలు, మంచి చెడులను పరిగణనలోకి తీసుకుని చట్టానికి పదనుపెడుతున్నామన్నారు. అలాగే 2020లో ఉన్న రెవెన్యూ చట్టంలో ప్రజలకు మేలు చేసే అంశాలు ఏమున్నా..... ఎలాంటి భేషజాలకు పోకుండా కొత్త చట్టంలో పొందుపరుస్తామన్నారు.

రెండు రోజుల క్రితం తాను స్వయంగా తిరుమలగిరి మండలంలో పర్యటించి రైతులతో మాట్లాడడం జరిగిందన్నారు. ఈ ఒక్క మండలంలోనే 4,380 ఎకరాలలో సర్వే నిర్వహిస్తే 1300 ఎకరాలు మోఖా మీద లేని వారికి పాసు బుక్కులు ఉన్నాయనే విషయం వెల్లడైందన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో ఏ మాత్రం రాజీ పడొద్దని భూముల పరిరక్షణ కోసం ఇక్కడికి వచ్చిన అధికారుల సూచన మేరకు ప్రతి మూడు నెలలకోసారి రాష్ట్ర స్థాయిలో, జిల్లా స్థాయిలో కోర్టుకు సంబంధించిన భూముల విషయంలో లీగల్ టీమ్ తో సమావేశం నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర స్థాయిలో జరిగే సమావేశంలో స్వయంగా తాను కూడా పాల్గొంటానని మంత్రి తెలిపారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా, ఎవరూ రెవెన్యూ శాఖ మంత్రిగా ఉన్నా, ఎవరూ కూడా ప్రభుత్వ భూముల రికార్డులను టాంపరింగ్ చేయకుండా ఉండేలా యుద్ధ ప్రతిపాదికన రెవెన్యూ రికార్డులను డిజిటలైజేషన్ చేపడుతామన్నారు.

కొత్తగా ఉద్యోగంలో చేరిన వారితో పాటు, సర్వీస్ లో ఉన్న ప్రతి ఒక్కరికీ శిక్షణ తప్పనిసరిగా చేస్తామన్నారు. రెవెన్యూ విభాగం ఉద్యోగులకు సంబంధించి జాబ్ చార్ట్ రూపొందించాలని, ఇందుకోసం ఒక కమిటీని ఏర్పాటు చేసిందుకు ఇతర రాష్ట్రాలలో అధ్యయనం చేస్తామన్నారు. ఈ ప్రభుత్వానికి కండ్లు, చెవులు అధికారులేనని....అందువల్ల మీరు బాగా పని చేస్తేనే ప్రజలకు మేలు కలగడంతో పాటు ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్నారు. గత పది సంవత్సరాల నుంచి అనుభవిస్తున్న గోసను చెప్పుకోడానికి రెవెన్యూ కార్యాలయాలకు వచ్చే సామాన్యులను అక్కున చేర్చుకోవాలన్నారు. వారితో ఫ్రెండ్లీగా వ్యవహరించాలన్నారు. గతానికి ప్రస్తుత ప్రభుత్వానికి తేడా కనబడాలన్నారు. వచ్చిన ప్రతి మనిషిని గౌరవించాలన్నారు. వ్యవస్థలో ఒకరిద్దరు తప్పు చేయడం వల్ల అందరికి చెడ్డ పేరు వస్తున్నదన్నారు. అందువల్ల జాగ్రత్తగా పని చేయాలని వారికి మంత్రి సూచించారు. ప్రజలకు సేవ చేసే విషయంలో అధికారల పాత్ర అత్యంత ప్రధానమైనదన్నారు. మీరు వేసే ప్రతి అడుగు ప్రతి పని రెవెన్యూ వ్యవస్థకు వన్నె తెచ్చేలా ఉండాలన్నారు

ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు వీలైనంత ప్రాణ నష్టం ఆస్తి నష్టం జరగకుండా రెవెన్యూ యంత్రాంగం చాలా బాగా పని చేసిందని కితాబిచ్చారు. రాష్ట్ర క్యాబినెట్ మీ అందరినీ అభినందించిందన్నారు. ఇది నాకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఉద్యోగుల సమస్యలకు సంబంధించి ఆర్థికేతర అంశాలను తక్షణమే పరిష్కరిస్తామన్నారు.ఆర్థిక పరమైన అంశాలలో కొంత ఆలోచన చేస్తాం కానీ ఉద్యోగుల పదోన్నతులు వంటి అంశాలను తక్షణమే పరిష్కరిస్తామన్నారు. 33 జిల్లాలలో సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పోస్టులను క్రియేట్ చేస్తామన్నారు. అలాగే 17 మంది రెవెన్యూ అధికారులకు ఐఏఎస్ హోదా కల్పించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల సమయంలో బదిలీ అయిన తహసిల్దార్లను పూర్వ స్థానాలకు బదిలీ చేయడానికి దసరాలోపే నిర్ణయం తీసుకుంటామన్నారు. ఉద్యోగులు చెప్పినట్టుగా యునిఫార్మ్ గా అందరికీ ఒకే రకమైన వాహనాలు ఉండాలన్న ఆలోచన చాలా మంచిదేనని...కానీ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకోవాలని సూచించారు. సరైన సమయంలో దీనిపై నిర్ణయం ఖచ్చితంగా తీసుకుంటామన్నారు. వాహనాల అద్దెలకు సంబంధించి ఈ నెల చివరి వరకు 50 శాతం క్లియర్ చేస్తామన్నారు. గత ప్రభుత్వం మండలాలు, రెవెన్యూ డివిజన్లు, జిల్లాలను పెంచింది కానీ అక్కడ మౌళిక సదుపాయాలను విస్మరించిందని విమర్శించారు. దాదాపు 200 మండలాలకు సొంత భవనాలు లేవన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా ఆర్భాటాలకు, హెచ్చులకు పోవద్దన్నారు. అప్పులు చేసి ఉన్న బిల్డింగ్ లను కూలగొట్టి సెక్రటేరియట్ ను నిర్మించడం అవసరమా ? కొన్ని జిల్లాల్లో కలెక్టర్ కార్యాలయాలు ఉన్నా కూడా కొత్తవి నిర్మించారన్నారు. లేని దగ్గర కట్టడం అవసరమే, కానీ ఉన్నవాటిని కూల్చి కట్టడం అవసరమా ? ప్రజా ధనాన్ని ధుర్వినియోగం చేయడం కాదా ? నేనైతే ఇటువంటి పనులు చేయనని అన్నారు..

రెవిన్యూ శాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ మాట్లాడుతూ, గత తొమ్మిది నెలలలో రెవెన్యూ శాఖ మంత్రి ఆధ్వర్యంలో ప్రజలకు అనువైన విధంగా రెవెన్యూ సంస్కరణలు చేపట్టామన్నారు. దాదాపు 3.50 లక్షల ధరణి ధరఖాస్తులను పరిష్కరించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురుశెట్టి, రాష్ట్ర సివిల్ సర్వీసెస్ డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి ఏ. భాస్కర రావు, డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వి. లచ్చి రెడ్డి, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, ట్రెసా అధ్యక్షులు వంగ రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గౌతమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

Printed and Published Mallika. On behalf of Sri Krishna Vande Jagadgurum Publications, Published at Banjara Hills Road , Erramazill 6-3-562-14, Hyderabad - Telangana 500082.
Printing at Colour Graphics, 2-6-652/12, Amberpet Musarambagh Road ,Hyderabad, 500013 Telangana. Editor Sramik (Responsible for selection of News under the PRB act )
Reg no APTEL / 2012/46581, Phone Number 9849290606, Email ID : janapadham0606@gmail.com